PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 74, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, సోమవారం - 04 - మే - 2026 , వెల రూ.5/-



### ఆసక్తికర సన్నివేశం...

### ఎర్రబెల్లి దయాకర్ రావు భుజం తట్టిన చంద్రబాబు

- బండ్ల గణేశ్ కుమార్తె నిశ్చితార్థ వేడుకలో ఆత్మీయ పలకరింపు
- చంద్రబాబు కనిపించగానే దగ్గరకు వెళ్లి చేతులు పట్టుకుని ఎర్రబెల్లి పలకరింపు
- ఎర్రబెల్లి భుజం తట్టి, నమస్కరించిన చంద్రబాబు

# పవన్ కల్యాణ్, నేను ఇగోలకు పోకుండా పనిచేస్తున్నాం...

## 2024 ఎన్నికల్లో వచ్చిన విజయం గతంలో ఎప్పుడూ చూడలేదు

### రాజకీయాల్లో ఎన్నో విజయాలను చూశా

- ★ అధికారులు కూడా అలాగే పనిచేయాలి
- ★ మోడీ వల్లే ఏపీకి గూగుల్ సంస్థ వచ్చింది
- ★ డిన్నర్ విత్ రియల్ విన్నర్స్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- ★ 22 నెలల క్రితం పాలన ప్రారంభించినప్పుడు వ్యవస్థలను సరి చేయడం సాధ్యం కాదేమోనని అనుకున్నా





అమరావతి: బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు రావడానికి టీమ్ ఏపీ పని తీరే కారణమని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మంత్రులు, అధికారులు, ఉద్యోగులే రియల్ విన్నర్స్ అని సీఎం చెప్పుకొచ్చారు.'రాజకీయంగానూ... పరిపాలనా పరంగానూ నేను, పవన్ కళ్యాణ్ ఎలాంటి ఇగోలకు వెళ్లకుండా ప్రజల కోసం పని చేస్తున్నాం. అధికారులు, ఉద్యోగులు కూడా విధులు నిర్వహించే విషయంలో ఇగోలకు పోకుండా రాష్ట్రం కోసం పనిచేయాలి'అని సీఎం చంద్రబాబు మిగతా.. 2లో

### ఇరాన్ డీల్‌పై ట్రంప్ సమీక్ష...

### అయినా దాడులు తప్పవంటూ హెచ్చరిక!



ఇరాన్‌తో ఒప్పందంపై తనకు వివరించారని తెలిపిన డొనాల్డ్ ట్రంప్

పూర్తి వివరాలు చూశాకే నిర్ణయం తీసుకుంటానని స్పష్టీకరణ

ఇరాన్ దురుసుగా ప్రవర్తిస్తే సైనిక దాడులు తప్పవని హెచ్చరిక



### శిక్షణ కోసం సింగపూర్‌కు 37 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు

- ▶▶ సింగపూర్ పర్యటనకు ఏపీ బెస్ట్ టీచర్లు... మంత్రి నారా లోకేష్ స్పందన
- ▶▶ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో 5 రోజుల ప్రత్యేక కార్యక్రమం
- ▶▶ ఆధునిక బోధన పద్ధతులపై టీచర్లకు శిక్షణ
- ▶▶ ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితే తరగతి గది మారుతుందన్న మంత్రి లోకేష్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 మంది ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులను మిగతా.. 2లో

# 100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు

## ఉద్యోగులకు సీఎం రేవంత్ నాలుగు వరాలు.. పీఆర్సీపై కీలక ఆదేశాలు

- ★ ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు కీలక హామీలు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి
- ★ జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు
- ★ వేతన సవరణపై పీఆర్సీ నివేదికను వెంటనే ఇవ్వాలని ఆదేశాలు
- ★ ప్రభుత్వ నిర్ణయాలతో మే 5న తలపెట్టిన ధర్నాను విరమించుకున్న ఉద్యోగ సంఘాలు
- ★ ఉద్యోగుల సమస్యల పరిష్కారం తమ బాధ్యత అని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు కీలకమైన శుభవార్తలు చెప్పారు. ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో జరిగిన సమావేశంలో వారి దీర్ఘకాలిక డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. ఈ నిర్ణయాలతో సంతృప్తి చెందిన ఉద్యోగ సంఘాలు, మే 5న తలపెట్టిన ధర్నాతో పాటు ఇతర నిరసన కార్యక్రమాలను విరమించుకుంటున్నట్లు మిగతా.. 2లో



### సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరు... రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

- ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేటీఆర్ ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఘాటైన బహిరంగ లేఖ
- జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- 10 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా పథకానికి ఎసరు పెడుతున్నారని విమర్శ



### కవితతో పార్టీ ఎవరు పెట్టించారో

# అందరికీ తెలుసు

కవిత పార్టీపై కేఏ పాల్ ఆసక్తికర వ్యాఖ్యలు


అందుకే ఆ పార్టీలో మాజీలు చేరడం లేదని వ్యాఖ్య

కవిత సీఎం పదవి అడిగితే తండ్రి నిరాకరించారన్న పాల్

యుద్ధం ఆపేందుకు ట్రంప్‌తో చర్చలు జరిపే పనిలో ఉన్నానన్న కేఏ పాల్

హైదరాబాద్: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కవితపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన ఆరోపణలు చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన కవిత ఏర్పాటు చేసిన పార్టీపై స్పందిస్తూ ఓ వీడియోను విడుదల చేశారు. ఆమెతో పార్టీని ఎవరు పెట్టించారో అందరికీ తెలుసని, మిగతా.. 2లో

### మా అనుమతి లేకుండా ఒక్క నౌక కూడా హర్మూజ్ దాటదు: ఇరాన్ హెచ్చరిక



హర్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ తమదేనన్న ఇరాన్

తమ అనుమతి లేకుండా నౌకల రాకపోకలు సాధ్యం కాదని స్పష్టీకరణ

తమ నౌకలను అనుమతించాలని పలు దేశాలు కోరుతున్నాయని వెల్లడి

# కరీంనగర్ లో దొంగల బీభత్సం...

## కొన్ని నిమిషాల ముందు తాను అదే ప్రాంతంలో ఉన్నానన్న బండి సంజయ్

కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలర్స్‌లో కాల్పుల ఘటన

దోపిడీ యత్నాన్ని అడ్డుకోవడంతో సిబ్బందిపై దుండగుల దాడి

ఈ ఘటనలో సేల్స్ మేనేజర్ సహా పలువురు ఉద్యోగులకు గాయాలు

ఘటనపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి

నిందితుల కోసం పోలీసుల గాలింపు, సీసీటీవీ ఫుటేజ్ పరిశీలన



హైదరాబాద్: కరీంనగర్‌లోని పీఎంజే జువెలర్స్‌లో జరిగిన కాల్పుల ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మిగతా.. 2లో

# విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో డెంటిక్ వరల్డ్ సంస్థ ప్రారంభం

## భారతదేశ దంతవైద్య రంగం ప్రస్తుతం భారీగా దిగుమతులపై ఆధారపడి ఉంది

85-90% దంతవైద్య పరికరాలు విదేశాల నుంచి రావడంతో సామాన్యులకు అధునాతన దంతవైద్యం అందుబాటులో ఉండట్లేదు


భారతదేశం సొంతంగా డెంటల్ టెక్నాలజీని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డెంటిక్ వరల్డ్‌ను స్థాపించాం

దంతవైద్య కళాశాలలకు, పరిశోధకులకు, పరిశ్రమల భాగస్వాములకు మద్దతుగా నిలుస్తుంది



విశాఖపట్నం (పరవాడ): దేశంలోనే మొట్టమొదటి డెంటల్ మెడ్‌టెక్ స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ హబ్ అయిన మిగతా.. 2లో

### సముద్ర గర్భంలో భారత త్రివర్ణ పతాకం... !



అండమాన్‌లో సముద్ర గర్భంలో అతిపెద్ద జాతీయ జెండా ఆవిష్కరణ

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న భారత్

223 మంది డైవర్ల బృందంతో ఈ ఫీట్ సాధన

పాల్గొన్న నౌకాదళం, పోలీసులు, ఇతర ఏజెన్సీల సిబ్బంది

# కక్ష్యలోకి భారత్ ‘దృష్టి’..

ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ ఉపగ్రహం

కాలిఫోర్నియాలోని ప్రయోగ కేంద్రం నుంచి ఫాల్కన్-9 రాకెట్ సాయంతో విజయవంతంగా కక్ష్యలోకి

ప్రపంచంలో ఆప్టో-సార్ సాంకేతిక కలిగిన మొట్టమొదటి ఉపగ్రహం

భూ పరిశీలన సాంకేతికత పరిజ్ఞానంలో ఇది కీలక మైలురాయి

“190 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం.. 1.5 మీటర్ల రిజల్యూషన్‌తో చిత్రాలను అందిస్తుంది

ఢిల్లీ: బెంగళూరుకు చెందిన అంతరిక్ష అంకుర సంస్థ గెలాక్స్‌ఐ పంపించిన ‘దృష్టి’ ఉపగ్రహం నింగిలోకి దూసుకెళ్లింది. కాలిఫోర్నియాలోని ప్రయోగ కేంద్రం నుంచి ఫాల్కన్-9 రాకెట్ సాయంతో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు గెలాక్స్‌ఐ వెల్లడించింది. ఇది ప్రపంచంలో ఆప్టో-సార్ సాంకేతిక కలిగిన మొట్టమొదటి ఉపగ్రహమని పేర్కొంది.



మిగతా.. 2లో

## ఇరాన్ డీల్‌పై ట్రంప్ సమీక్ష...
# అయినా దాడులు తప్పవంటూ హెచ్చరిక!

ఢిల్లీ: ఇరాన్‌తో ఒప్పందానికి సంబంధించిన కాన్సెప్ట్‌పై తనకు వివరించారని, అయితే తుది ప్రతిని పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అదే సమయంలో టెహ్రాన్ దుందుడుకుగా ప్రవర్తిస్తే సైనిక చర్యకు వెనుకాడబోమని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఫ్లోరిడా నుంచి మియామి వెళ్లే ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. “ఒప్పందానికి సంబంధించిన కాన్సెప్ట్‌ను వారు నాకు వివరించారు. ఇప్పుడు పూర్తి వివరాలతో కూడిన ప్రతిని ఇవ్వనున్నారు” అని ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో, చర్చలకు సిద్ధమంటూనే ఒత్తిడిని కొనసాగించే ద్వంద్వ వైఖరిని వాషింగ్టన్ అవలంబిస్తోంది. ఇరాన్‌పై తిరిగి దాడులు చేసే అవకాశాన్ని తోసిపుచ్చలేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ అంశంపై తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో కూడా ట్రంప్ స్పందించారు. “గత 47 ఏళ్లుగా ప్రపంచానికి, మానవాళికి ఇరాన్ చేసిన నష్టానికి ఇంకా తగిన మూల్యం చెల్లించలేదు. కాబట్టి వారు పంపిన ప్రణాళిక ఆమోదయోగ్యంగా ఉంటుందని నేను ఊహించలేను” అని ఆయన పోస్ట్ చేశారు. తమ ప్రతిపాదనను పాకిస్థాన్ ద్వారా ఇరాన్ అమెరికాకు పంపింది. ఈ డీల్‌కు అంగీకరిస్తే కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలను పునరుద్ధరిస్తామని, అమెరికా దిగ్బంధనానికి ముగింపు పలుకుతామని ఇరాన్ తెలిపింది. అయితే, తమ అణు కార్యక్రమంపై చర్చలను తదుపరి దశకు వాయిదా వేయాలని ఇరాన్ కోరుతోంది. ఈ ప్రతిపాదనను ట్రంప్ గతంలో తిరస్కరించారు. దౌత్యపరంగా చర్చలకు కట్టుబడి ఉన్నామని, కానీ ఎలాంటి సైనిక చర్యకైనా దీటుగా బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధికారులు స్పష్టం చేశారు.

## మా అనుమతి లేకుండా ఒక్క నౌక కూడా
# హర్మూజ్ దాటదు: ఇరాన్ హెచ్చరిక

ఢిల్లీ: హర్మూజ్ జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ ఉందని, తమ అనుమతి లేకుండా స్నేహపూర్వక లేదా శత్రు దేశాలకు చెందిన ఏ నౌక కూడా ఆ మార్గం గుండా ప్రయాణించలేదని ఇరాన్ ఆర్మీ స్పష్టం చేసింది. ఈ జలసంధిని నియంత్రించడం తమకు ఉన్న సహజమైన హక్కు అని ఇరాన్ ఆర్మీ ప్రతినిధి మహమ్మద్ అక్రమినియా అన్నారు. ప్రస్తుతం ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, దేశ సైన్యం సంయుక్తంగా హర్మూజ్ జలసంధిని పూర్తిస్థాయిలో నియంత్రిస్తున్నాయని ఆయన తెలిపారు. తమ బలగాల అనుమతి లేకుండా ఏ నౌకకూ ప్రయాణించే హక్కు లేదని ఆయన తేల్చి చెప్పారు. మరోవైపు, తమ నౌకలను అనుమతించాలంటూ వివిధ దేశాలు టెలెక్స్, లేఖల ద్వారా ఇరాన్‌ను అత్యవసరంగా అభ్యర్థిస్తున్నాయని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి హమీద్ ఘన్‌బారీ వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ హర్మూజ్ జలసంధిపై తన పట్టును బిగించింది. తమ భూభాగంపై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేసిన నేపథ్యంలో ఆ రెండు దేశాలకు చెందిన, వాటితో సంబంధం ఉన్న నౌకలపై ఇరాన్ నిషేధం విధించింది. ఇదిలా ఉండగా, పెర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధిలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖొమైనీ అన్నారు. ఈ జలసంధి నిర్వహణకు త్వరలోనే ఒక కొత్త చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకువస్తామని, ఇది ఈ ప్రాంతంలోని అన్ని దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో పెర్షియన్ గల్ఫ్ ‘అమెరికా రహితంగా’ శాంతి, శ్రేయస్సుతో వర్ధిల్లుతుందని ఆయన పేర్కొన్నారు.

# సముద్ర గర్భంలో భారత త్రివర్ణ పతాకం... !

ఢిల్లీ: భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. అండమాన్ నికోబార్ దీవుల్లోని ప్రఖ్యాత రాధానగర్ బీచ్‌లో సముద్ర గర్భంలో అతిపెద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. ఈ అద్భుత ఘట్టం దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఈ చారిత్రాత్మక ఫీట్‌ను 223 మందితో కూడిన డైవర్ల బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ బృందంలో భారత నౌకాదళం, పోలీసు సిబ్బందితో పాటు ఇతర ఏజెన్సీలకు చెందిన నిపుణులు కూడా పాలుపంచుకున్నారు. అత్యంత సమన్వయంతో వీరంతా కలిసి నీటి అడుగున త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో, సముద్రంలో ఆవిష్కరించిన అతిపెద్ద జాతీయ జెండాగా ఇది గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో అధికారికంగా నమోదైంది. ఈ ఘనతతో అండమాన్ నికోబార్ దీవుల పేరు మరోసారి ప్రపంచ యవనికపై నిలిచింది. ఈ అపురూప దృశ్యం దేశ ప్రజల్లో స్ఫూర్తిని నింపింది.

## ఆసక్తికర సన్నివేశం...
# ఎర్రబెల్లి దయాకర్ రావు భుజం తట్టిన చంద్రబాబు

అమరావతి: ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని నిశ్చితార్థ వేడుకలో ఆసక్తికర సన్నివేశం కనిపించింది. హైదరాబాద్‌లో ఈరోజు జనని, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజల నిశ్చితార్థం జరిగింది. ఈ వేడుకకు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎదురుపడ్డారు. వేడుకకు హాజరయ్యేందుకు ఇద్దరూ దాదాపు ఒకే సమయంలో వచ్చారు. రాజకీయాలను పక్కనపెట్టి వారు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చంద్రబాబు కనిపించగానే ఎర్రబెల్లి దయాకర్ రావు దగ్గరకు వెళ్ళి, ఆయన చేతులు పట్టుకుని కాస్త వంగి నమస్కరించారు. చంద్రబాబు ఆయన భుజం తట్టి, నమస్కరించారు. దీంతో ఎర్రబెల్లి కూడా ప్రతినమస్కారం చేశారు. ఆ తర్వాత ఏపీ ముఖ్యమంత్రి అక్కడి నుంచి ముందుకు కదిలారు. ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు ఎర్రబెల్లి దయాకర్ రావు తెలుగుదేశం పార్టీలో, చంద్రబాబు నేతృత్వంలో సుదీర్ఘకాలం పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత కొంతకాలం టీడీపీలోనే ఉన్నప్పటికీ, ఆ తర్వాత టీఆర్ఎస్ (నేటీ బీఆర్ఎస్)లో చేరారు. బండ్ల గణేశ్ కుమార్తె నిశ్చితార్థ వేడుకకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవి, దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, స్టార్ కమెడియన్ బ్రహ్మానందం, దర్శకుడు శ్రీను వైట్ల, శివాజీ, కోన వెంకట్, సి. కల్యాణ్, విజయవాడ మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ తదితరులు హాజరయ్యారు.

## సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరు...
# రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్: తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై రాజకీయ దుమారం చెలరేగింది. ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘాటైన బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని అన్నారు. సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరని ఆయన హెచ్చరించారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చారని కేటీఆర్ తన లేఖలో తీవ్రస్థాయిలో విమర్శించారు. “ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 7 ముమ్మాటికీ ఫీజుల పథకానికి పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ. దీనివల్ల 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుంది. ఇది నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే వెన్నుపోటు చర్య” అని కేటీఆర్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను వెంటనే వెనక్కి తీసుకుని, విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా కొనసాగించిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ పథకానికి గ్రహణం పట్టిందని విమర్శించారు. గత రెండున్నరేళ్లుగా సుమారు 10 వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను చెల్లించలేదని, ఇప్పుడు విద్యార్థుల ఖాతాల్లో నేరుగా డబ్బులు వేస్తామంటే ఎవరూ నమ్మరని కేటీఆర్ అన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో 2500కు పైగా కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. నిధులు అడిగిన వారిని వన్-టైమ్ సెటిల్మెంట్, టోకెన్ల పేరుతో మభ్యపెట్టారని, నిరసన తెలిపితే విజిలెన్స్ దాడులతో బెదిరించారని ఆరోపించారు. ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే గురుకులాల్లో 142 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికీ వేలాది మంది సరైన భోజనం లేక ఆసుపత్రుల పాలవుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. “ఒకవైపు 3.75 లక్షల కోట్ల అప్పులు చేసిన ప్రభుత్వం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు మాత్రం ఒక్క రూపాయి విడుదల చేయకపోవడం దుర్మార్గం. రైతుబంధును మూడుసార్లు ఎగ్గొట్టి రైతులను దగా చేశారు. ఇప్పుడు ఫీజుల పథకానికి మంగళం పాడేందుకు దొడ్డిదారులు వెతుకుతున్నారు” అని కేటీఆర్ దుయ్యబట్టారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలుంటాయని కేటీఆర్ హెచ్చరించారు. “ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ చీకటి జీవోను వెంటనే రద్దు చేయాలి. లేదంటే 14 లక్షల మంది విద్యార్థులతో కలిసి కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తాం. ఇప్పటికే రైతుల ఆందోళనలతో రాష్ట్రం అట్టుడుకుతోంది. దీనికి విద్యార్థుల ఆగ్రహం కూడా తోడైతే ముఖ్యమంత్రి, మంత్రులు రోడ్లపై తిరగలేని పరిస్థితి వస్తుంది” అని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు.

# విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో డెంటిక్ వరల్డ్ సంస్థ ప్రారంభం

మొదటి పేజి తరువాయి

డెంటిక్ వరల్డ్ సంస్థను విశాఖ మెడ్‌టెక్ జోన్ ప్రాంగణంలో ఏర్పాటుచేశారు. మెడ్‌టెక్ జోన్ సీఈఓ డాక్టర్ జితేంద్ర శర్మ, డెంటిక్ వరల్డ్ సీఈవో కృష్ణసాయి ఇంకోలు దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ దంతవైద్య రంగం ప్రస్తుతం భారీగా దిగుమతులపై ఆధారపడి ఉందని, దాదాపు 85-90% దంతవైద్య పరికరాలు విదేశాల నుంచి రావడంతో సామాన్యులకు అధునాతన దంతవైద్యం అందుబాటులో ఉండట్లేదని.. ఈ లోటు భర్తీ చేసేందుకు భారతదేశం సొంతంగా డెంటల్ టెక్నాలజీని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డెంటిక్ వరల్డ్‌ను స్థాపించామన్నారు. ఈ హబ్ స్టార్టప్‌లకు, దంతవైద్య కళాశాలలకు, పరిశోధకులకు, పరిశ్రమల భాగస్వాములకు మద్దతుగా నిలుస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలమంది దంతవైద్యులు సరికొత్త ఆవిష్కరణలను త్వరగా అందిపుచ్చుకోవడానికి ఇది సహాయపడుతుందని, ఈ హబ్ ద్వారా పరిశోధన, డెంటల్ డిజైన్ సేవల తయారీ, టెస్టింగ్, క్లినికల్ వాలిడేషన్ లాంటి అంశాల్లో సమగ్ర మద్దతు అందిస్తుందన్నారు. ప్రస్తుతం దిగుమతి అవుతున్న జిర్కోనియాడిస్క్‌లు, నెక్స్ట్ జనరేషన్ డెంటల్ ఇంప్లాంట్ల లాంటి కీలక ఉత్పత్తులను ఇక్కడే తయారు చేయడంపై డెంటిక్ వరల్డ్ ప్రధానంగా దృష్టి సారిస్తుందన్నారు. అత్యాధునిక ఉత్పాదక సౌకర్యాలు ఉండడంతో కొత్తగా వచ్చే ఆవిష్కర్తలకు, స్టార్టప్‌లకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ఇది మేక్ ఇన్ ఇండియా దార్శనికతకు అనుగుణంగా ఉండడమే కాకుండా విశాఖను డెంటల్ టెక్నాలజీ తయారీకి ప్రధాన కేంద్రంగా మారుస్తుందన్నారు. అనంతరం ఆయా సంస్థల ప్రతినిధులు అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్, నేను ఇగోలకు
# పోకుండా పనిచేస్తున్నాం...

మొదటి పేజి తరువాయి

ఇగోలకు పోకుండా రాష్ట్రం కోసం పనిచేయాలి’అని సీఎం చంద్రబాబు సూచించారు. ‘రాజకీయాల్లో ఎన్నో విజయాలను చూశాను కానీ 2024 ఎన్నికల్లో వచ్చిన విజయం గతంలో ఎప్పుడూ చూడలేదు. 22 నెలల క్రితం పాలన ప్రారంభించినప్పుడు వ్యవస్థలను సరి చేయడం సాధ్యం కాదేమోనని అనుకున్నా. కానీ టీమ్ ఏపీ సహకారం వల్లే వ్యవస్థలను గాడిలో పెట్టగలిగాం... ఆ టీమ్ వల్లే ఈ అవార్డు వచ్చింది’అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు వచ్చినందుకు మంత్రులు, సీఎస్, డీజీపీ, సెక్రటరీలు, హెచ్ఓడీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. ఈ అవార్డు మంత్రులు, అధికారులు, ఉద్యోగుల వల్లే వచ్చింది అని చెప్పుకొచ్చారు. అందరూ సహకరిండం వల్లే అభివృద్ధి చేస్తున్నాం... సంక్షేమం అందిస్తున్నాం అని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

మోడీ వల్లే ఏపీకి గూగుల్ సంస్థ వచ్చింది

‘ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ప్రవేశపెట్టాం... అధికారులు అద్భుతంగా పనిచేశారు. పారిశ్రామికవేత్తలు ప్రభుత్వం వెంట పడడం కాదు... ప్రభుత్వమే పారిశ్రామిక వేత్తల వద్దకు వెళ్లి మాట్లాడాలి. ఇలా చేయడం వల్లే అభివృద్ధి సాధించగలిగాం’అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ‘నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో చాలా మంది ప్రధానులను చూశాను... సరైన సమయంలో సరైన ప్రధానిగా నరేంద్ర మోడీ నిలిచారు. గూగుల్ సంస్థ ఏపీకి రాగలిగిందంటే ప్రధాని మోడీనే కారణం. గూగుల్ సంస్థ ఏపీకి వచ్చేందుకు అవసరమైన నిబంధనలు చేశారు’అని సీఎం చంద్రబాబు నాచుడు చెప్పుకొచ్చారు.

# శిక్షణ కోసం సింగపూర్‌కు 37 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 మంది ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రత్యేక శిక్షణ కోసం సింగపూర్‌కు పంపింది. ఈ బృందం సింగపూర్ పర్యటనకు వెళ్లడం పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో ఐదు రోజుల పాటు జరిగే ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆధునిక బోధన పద్ధతులు, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను (క్రిటికల్ థింకింగ్) పెంపొందించడం, విద్యార్థి కేంద్రిత బోధన వంటి అంశాలపై వీరికి లోతైన అవగాహన కల్పించనున్నారు. ప్రపంచ స్థాయి ఉత్తమ విద్యా విధానాలను నేర్చుకుని, వాటిని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మంత్రి లోకేష్ వివరించారు. “ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితేనే తరగతి గది రూపాంతరం చెందుతుంది” అనే బలమైన ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. ఈ అంతర్జాతీయ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల నైపుణ్యాలు మెరుగుపడి, రాష్ట్ర విద్యా వ్యవస్థ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## కవితతో పార్టీ ఎవరు పెట్టించారో
# అందరికీ తెలుసు

హైదరాబాద్: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కవితపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన ఆరోపణలు చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన కవిత ఏర్పాటు చేసిన పార్టీపై స్పందిస్తూ ఓ వీడియోను విడుదల చేశారు. ఆమెతో పార్టీని ఎవరు పెట్టించారో అందరికీ తెలుసని, అందుకే మాజీ ప్రజాప్రతినిధులు ఎవరూ ఆ పార్టీలో చేరడం లేదని అన్నారు. అవినీతి, కుటుంబ, కుల పార్టీలను ఎవరూ నమ్మవద్దని కోరారు. ఆమె స్థాపించిన పార్టీ వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని విమర్శించారు. కేవలం తండ్రితో ఉన్న గొడవ కారణంగానే ఆమె పార్టీని ఏర్పాటు చేశారు తప్ప మరో కారణం లేదని అన్నారు. తాను అమెరికా పర్యటనలో బిజీగా ఉన్నానని, అందువల్లే తెలంగాణ రాజకీయాలపై దృష్టి సారించలేకపోయానని పేర్కొన్నారు. గతంలో కవిత తన తండ్రిని ముఖ్యమంత్రి పదవి అడిగారని, అందుకు కేసీఆర్ నిరాకరించారని పేర్కొన్నారు. 2008లోనే కవిత తన వద్దకు వచ్చి పార్టీ కోసం రూ.10 కోట్లు ఇవ్వాలని అడిగారని, తాను రూ.15 కోట్లు ఇవ్వాలనుకున్నానని చెప్పారు. కానీ కవితకు ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని కేసీఆర్ కోరడంతో ఆగిపోయానని చెప్పారు. తన ఆస్తులను కాపాడుకోవడం కోసమే కవిత పార్టీని ఏర్పాటు చేశారని ఆరోపించారు. దోచుకున్న డబ్బుల విషయంలో షర్మిలకు ఎలాగైతే అన్నతో విభేధాలు వచ్చాయో, కవితకు తన కుటుంబంతో అలాగే వచ్చాయని అన్నారు.

అమెరికా, ఇరాన్ యుద్ధంపై..

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతోన్న యుద్ధాన్ని ఆపేందుకు తాను డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరిపే పనిలో ఉన్నానని అన్నారు. ఈ యుద్ధం ఆగకపోతే ప్రపంచవ్యాప్తంగా ఉన్న 850 కోట్ల మంది తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్‌తో పాటు ఎందరో దేశాధినేతలు తన సలహాలు, సూచనలు తీసుకుంటారని వ్యాఖ్యానించారు. తాను అప్పులు తీసుకువచ్చి తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేయగలనని చెప్పారు.

## 100 రోజుల్లో రూ.6000 కోట్ల
# బకాయిల చెల్లింపు

మొదటి పేజి తరువాయి

కార్యక్రమాలను విరమించుకుంటున్నట్లు ప్రకటించాయి. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో ఉద్యోగుల సేవలను సీఎం ఈ సందర్భంగా అభినందించారు.

### జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు

ఉద్యోగులందరికీ ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలన్న ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, జూన్ 1వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి కార్డులు అందజేస్తుందని స్పష్టం చేశారు.

100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే 100 రోజుల్లో రూ.6,000 కోట్లను విడుదల చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ నిధులను ఏ ప్రాధాన్యతా క్రమంలో ఎవరికి ముందుగా చెల్లించాలనే నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాలకే వదిలివేస్తున్నట్లు ఆయన తెలపడం విశేషం.

పీఆర్సీ నివేదికపై తక్షణ ఆదేశం

ప్రభుత్వ ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ (పీఆర్సీ) అంశంపైనా సీఎం స్పష్టత ఇచ్చారు. పీఆర్సీ నివేదికను తక్షణమే ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత కమిషన్‌ను ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే జీతాల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ఇందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 67,760 ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

రెండు నెలలకోసారి సమావేశం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర సంప్రదింపుల ప్రక్రియను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఇకపై ప్రతి రెండు నెలలకోసారి ఉద్యోగ సంఘాలు సమావేశమై, తమ సమస్యలు, ఆందోళనలపై ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించాలని సూచించారు. “ఇది ఉద్యోగ స్నేహపూర్వక ప్రభుత్వం, మీ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మాపై ఉంది” అని ఆయన భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించడం, గందరగోళం లేకుండా ఉపాధ్యాయ బదిలీలు చేపట్టడం వంటి చర్యలను ఆయన గుర్తుచేశారు.

# కరీంనగర్ లో దొంగల బీభత్సం...

మొదటి పేజి తరువాయి

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన జరిగిన కొన్ని నిమిషాల ముందే తాను అదే ప్రాంతంలో ఉన్నానని, తన కార్యాలయానికి సమీపంలోనే ఈ ఘటన జరగడం బాధాకరమని ఆయన అన్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని కరీంనగర్ ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, ఐదుగురు సాయుధ దుండగులు కస్టమర్ల రూపంలో జువెలరీ షాపులోకి ప్రవేశించారు. బంగారు ఆభరణాలు చూపించమని కోరారు. సిబ్బంది నగలు బయటికి తీయగానే, తుపాకులతో బెదిరించి దోపిడీకి యత్నించారు. సిబ్బంది ప్రతిఘటించడంతో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో సేల్స్ మేనేజర్‌తో పాటు ఇతర ఉద్యోగులు గాయపడ్డారు. గాయపడిన సిబ్బందిని, పోలీసు అధికారులను కలిసి వివరాలు తెలుసుకున్నట్లు బండి సంజయ్ తెలిపారు. క్షతగాత్రులకు ప్రాణాపాయం లేదని, మెరుగైన చికిత్స కోసం వారిని హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ పోలీసులు తక్షణమే స్పందించారని, పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారని వివరించారు. సీసీటీవీ ఫుటేజీని విశ్లేషిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారని, నిందితులను పోలీసులు త్వరలోనే పట్టుకుంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కక్ష్యలోకి భారత్ ‘దృష్టి’..

మొదటి పేజి తరువాయి

భూ పరిశీలన సాంకేతికత పరిజ్ఞానంలో ఇది కీలక మైలురాయి అని తెలిపింది. “190 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం.. భారత్‌లోని ప్రైవేటు సంస్థ నిర్మించిన శాటిలైట్లలో అతిపెద్దది. 1.5 మీటర్ల రిజల్యూషన్‌తో చిత్రాలను అందిస్తుంది. ఆప్టో-సార్ టెక్నాలజీతో ఇది పనిచేస్తుంది. ఎలక్ట్రో ఆప్టికల్ (ఇూ), సింథటిక్ ఎపెర్చర్ రాడార్ సెన్సర్లతో కలిపి పరిశీలనలు సాగిస్తుంది. అన్నిరకాల వాతావరణ పరిస్థితుల్లో.. పగలు, రాత్రి తేడా లేకుండా భూమిని నిరంతరం పరిశీలించే సామర్థ్యం దీని సొంతం” అని గెలాక్స్‌ఐ పేర్కొంది. గెలాక్స్‌ఐ చేపట్టిన దృష్టి ఉపగ్రహం విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడం పట్ల ప్రధాని మోదీ (గ్రావీ వీశీఎఐ) హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష పరిశోధనల్లో ఇదో కీలక విజయంగా నిలుస్తుందన్నారు. దేశ పురోగతి, ఆవిష్కరణల పట్ల యువత అభిరుచికి ఇదో నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా గెలాక్స్‌ఐ బృందానికి ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

## విజయం మాదే...
# 200కిపైగా స్థానాల్లో గెలుపొందుతాం

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తృణమూల్ కాంగ్రెస్ పార్టీదే అని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఈసారి 200 స్థానాల్లో టీఎంసీ అభ్యర్థులు గెలుపొందడం తథ్యం అని అన్నారు. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ అంచనాలను నమ్మాల్సిన అవసరం లేదని గతంలో కూడా ఇలాగే చెప్పాయని మమతా బెనర్జీ చెప్పుకొచ్చారు. పశ్చిమబెంగాల్‌లో ఈసారి అధికారంలోకి వచ్చేది బీజేపీ అంటూజోరుగా ప్రచారం జరుగుతుంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు సైతం బీజేపీకి అనుకూలం అని తేలిపోయింది.ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో బీజేపీలో సంబరాలు నెలకొన్నాయి. అయితే బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తాజాగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై స్పందించారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ తృణమూల్ పార్టీ 200 సీట్లకుపైగా గెలుచుకోవడం ఖాయం అని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు.శనివారం వర్చువల్‌గా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి దీదీ ప్రసంగించారు. ఎగ్జిట్ పోల్స్ అనేవి స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేసే ప్రయత్నం తప్ప మరేమి కాదని ఆమె చెప్పుకొచ్చారు.2021, 2024లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఇలాగే వేశాయని... ఇప్పుడు మళ్లీ అదే ప్రయత్నం చేస్తున్నారని మమతా బెనర్జీ ధ్వజమెత్తారు.

బీజేపీ దౌర్జన్యాలకు పాల్పడింది

పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ దౌర్జన్యాలకు పాల్పడింది అని మమతా బెనర్జీ ఆరోపించారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో తమ పార్టీ కార్యకర్తలపై దౌర్జన్యాలకు పాల్పడ్డారని మండిపడ్డారు.అయినప్పటకీ తమ పార్టీ కార్యకర్తలు ధీటుగా ఆ దౌర్జన్యాలను ఎదుర్కొన్నారని చెప్పుకొచ్చారు. అలాంటి పరిస్థితులు ఎదుర్కొన్న పార్టీ కార్యకర్తలకు భవిష్యత్‌లో తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో శ్రమించిన పార్టీ కార్యకర్తలకు దీదీ ధన్యవాదాలు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల్లో తగ్గని భానుడి ప్రతాపం...
# ద్రోణి ప్రభావంతో వడగండ్ల వాన

హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం దక్షిణ ఒడిశా నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మరియు తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి కొనసాగుతుందని... దీని ప్రభావంతో ఆదివారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. తెలంగాణ, రాయలసీమలోని పలు ప్రాంతాలలో 44 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి.ఒకవైపు ఎండలు తారెత్తిస్తుంటే మరోవైపు ద్రోణి ప్రభావంతో వడగండ్ల వానలు కురుస్తున్నాయి.భానుడు భగభగ మంటున్నప్పటికీ వర్షాలు మాత్రం కురుస్తూనే ఉన్నాయి. అమరావతి వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం దక్షిణ ఒడిశా నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మరియు తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి కొనసాగుతుంది. దీని ప్రభావంతో ఆదివారం ఎండ తీవ్రత స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని.. పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ -- యానాం


ఉల్లర కోస్తాంధ్ర, యానాంలలో ఆదివారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు -- ఈదురు గాలులు గంటకు 50 -- 60 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. మరోవైపు అధిక ఉష్ణోగ్రతలు నమోదులో అంతగా వ్యత్యాసం ఉండదని తెలుస్తోంది. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదులో గణనీయమైన మార్పు లేదు అని చెప్పుకొచ్చారు.

# విద్య,వైద్యం ఫ్రీగా ఇవ్వకపోతే రాళ్లతో కొట్టండి...



హైదరాబాద్: విద్య వైద్యం ఫ్రీగా ఇవ్వకుంటే రాళ్లతో కొట్టాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తాము ఇచ్చిన పాంచజన్యంలో పేర్కొన్న ఐదు అంశాలను అమలు చేయకుంటే గన్ పార్క్ లోని అమరుల స్థూపం స్తంభానికి కట్టేసి కొట్టాలని సూచించారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొని జర్నలిస్ట్ లు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానాలు చెప్పారు. తన తండ్రి కేసీఆర్ తో తనకు పంచాయితీ లేదని బీఆర్ఎస్ అధ్యక్షుడిగానే ఆయనను విమర్శించానని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చిన సరే తెలంగాణ ప్రజల కోసం తాను ముందుకే వెళ్తానన్నారు. తన టార్గెట్ సర్వోదయ తెలంగాణ సాధించటమేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలకు ఎవరైతే విలనో...తనకు కూడా వాళ్లే విలన్ అని చెప్పారు. కేసీఆర్ ను రాజకీయ నేతగానే విమర్శించానని తండ్రిగా ఆయనతో ఎలాంటి సమస్య లేదని టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత చెప్పారు. తెలంగాణ రక్షణ సేన ప్రకటించిన పాంచజన్యం లోని ఐదు అంశాలు, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల విషయంలో తాను ఇచ్చిన మాట తప్పితే అమరవీరుల స్తూపం వద్ద స్తంభానికి కట్టేసి కొట్టాలని కల్వకుంట్ల కవిత తెలిపారు. అన్ని విషయాల్లో సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాతే హామీలు ఇచ్చానని చెప్పారు. గత 20 ఏళ్లుగా తనను చూస్తున్నారని ఇచ్చిన మాట, పట్టిన తోవను విడవకుండా ఉన్నానని అన్నారు. తెలంగాణలో విద్య, వైద్యం కోసమే ప్రజలు 60 శాతం డబ్బు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కచ్చితంగా సంకల్పం తీసుకుంటే ఇది సాధ్యమేనని చెప్పారు. ఆరోగ్య శ్రీ ప్రారంభినప్పుడు, విద్యార్థులకు ఫ్రీ మీల్స్ పెట్టినప్పుడు కూడా ఇది సాధ్యమా అంటూ చాలా ప్రశ్నలు వచ్చాయన్నారు. కానీ ఇప్పుడు వాటిని అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పాంచజన్యంలోని ఐదు అంశాలను అమలు చేయటంపై ఆర్థిక నిపుణులతో చర్చలు జరిపానని కవిత చెప్పారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో లక్ష కోట్ల రూపాయలను తమ ప్రాధాన్యత అంశాలకు ఖర్చు చేయవచ్చన్నారు. ఆ విధంగా చూస్తే చేయాలన్న సంకల్పం ఉంటే చాలు ఇదంతా సాధ్యమేనని స్పష్టం చేశారు. తల్లిలా తాను పరిణితి చెందుతానంటే చాలా మంది విమర్శలు చేశారని కవిత గుర్తు చేశారు. కానీ తల్లి మాదిరి లాలన లేని కారణంగానే ఇవ్వాళ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక తల్లి మాదిరిగా ఆలోచిస్తే మాత్రమే ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పం వస్తుందన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వానికి అది చేతకావటం లేదన్నారు. వెయ్యి రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక తల్లి మాదిరి పాలన చేస్తామని టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత అన్నారు.

# ఎండలు భగభగ



విశాఖపట్నం: రాష్ట్రంలో ఎండలు భగభగలాడుతున్నాయి. ఏమాత్రం తగ్గుముఖం పట్టకపోగా రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో శనివారం 45.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డు అయినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. 17 జిల్లాల పరిధిలోని 239 మండలాల్లో 41 డిగ్రీలకుపైగా నమోదైనట్లు సంబంధిత ప్రతినిధులు వెల్లడించారు. వైఎస్సార్ కడప జిల్లాలో 34 మండలాలు, నెల్లూరు 32, తిరుపతి 29, పల్నాడు 26, ప్రకాశం 25, మార్కాపురం 21, నంద్యాల 20, కర్నూలు 17, చిత్తూరు జిల్లాలోని 10 మండలాల్లో ఎండ తీవ్రత ఎక్కువ ప్రభావం చూపిందన్నారు. రాజస్థాన్‌పై గల ఉపరితల ఆవర్తనం నుంచి విదర్భ, తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమోరియన్ ప్రాంతం వరకు ద్రోణి విస్తరించి ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. దీని ప్రభావంతో ఆదివారం 6 మండలాల్లో తీవ్ర వడగాలులు, 124 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## ఘనంగా సినీ నటుడు బండ్ల గణేష్ కుమార్తె నిశ్చితార్థ వేడుక

**- కాబోయే దంపతులను ఆశీర్వదించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్**



ఏలూరు, హైదరాబాద్ , నేటి శుభోదయ ::: ప్రముఖ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని నిశ్చితార్థ వేడుక ఆదివారం ఉదయం హైదరాబాద్ లో పార్క్ హయత్ హోటల్ లో అట్టహాసంగా జరిగింది. ఈ నిశ్చితార్థ వేడుకకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హాజరై, కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి వారిని ఆశీర్వదించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వరుడు సూర్యతేజతో జనని వివాహం త్వరలోనే జరగనుంది. ఆదివారం జరిగిన నిశ్చితార్థ వేడుకకు హాజరైన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కాబోవు దంపతులను నిండు మనసుతో ఆశీర్వదించినా అనంతరం, బండ్ల గణేష్ తో, వేడుకకు హాజరైన ఇతర ప్రముఖులతో కాసేపు ముచ్చటించారు.



## శ్రీ చౌదేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి






నంద్యాల, నేటి శుభోదయ ::: నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం నందవరంలో వెలసిన శ్రీ చౌదేశ్వరీ దేవి అమ్మవారికి టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు బైరెడ్డి రాజశేఖరరెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా ప్రధాన అర్చకులు రామకృష్ణ శర్మ బైరెడ్డి చే శ్రీ చౌదేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమర్చన, అలంకరణ దర్శనం చేయించి, ఆశీర్వచనం చేశారు. అనంతరం తీర్థ ప్రసాదం అందించి శేష వస్త్రంతో బైరెడ్డి రాజశేఖరరెడ్డిని సన్మానం చేశారు.

## పవన్ కళ్యాణ్ వినూత్న ఆలోచనలతో గ్రామీణాంధ్రకు మేలు జరుగుతోంది

**-మ్యాజిక్ డ్రెయిన్స్ తో పల్లెల్లో పారిశుధ్య విప్లవం తెచ్చారు-గ్రామాల్లో మురుగునీటి సమస్యకు ఇది చక్కటి పరిష్కార మార్గం-సిమెంటు డ్రెయిన్లతో పోలిస్తే 80 శాతం నిర్మాణ వ్యయం ఆదా.-ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు**



అమరావతి, మే 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన గ్రామీణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధన కోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ విప్లవాత్మక ఆలోచనలను అమలు చేస్తున్నారని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలంపిక్ మెడలిస్ట్ పి.వి. సింధు అభిప్రాయపడ్డారు. పవన్ కళ్యాణ్ ఆలోచనల నుంచి పురుడు పోసుకున్న మ్యాజిక్ డ్రెయిన్స్ పల్లెల్లో మురుగు సమస్య నివారణలో గేమ్ ఛేంజర్ లాంటిదన్నారు. ఉప ముఖ్యమంత్రివర్యుల 20 నెలల పాలన గురించి తన అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తూ విడుదల చేసిన వీడియో సందేశంలో మ్యాజిక్ డ్రెయిన్స్ లాంటి సరికొత్త విధానాలు అమలు చేయడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పి.వి. సింధు మాట్లాడుతూ "పాలనా వ్యవహారాలు కొత్తే అయినా పవన్ కళ్యాణ్ వినూత్న కార్యక్రమాలతో ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్నారు. మన దేశంలో మెజారిటీ శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తుంటారు. అయితే గ్రామాల్లో పారిశుధ్యం పెద్ద సవాలుగా ఉంటుంది. సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేక ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో జీవనం సాగిస్తూ ఉంటారు. ఈ సమస్యకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ మ్యాజిక్ డ్రెయిన్స్ రూపంలో అద్భుత పరిష్కార మార్గాన్ని కనుగొన్నారు. ఇంకుడు గుంతలతో కూడిన డ్రెయిన్లు ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీటిని క్షణాల్లో మాయం చేస్తాయి. మూడంచెల ఫిల్టర్ బెడ్ల ద్వారా శుద్ధి చేయబడిన నీటిని భూగర్భ జలంగా మార్చేస్తాయి. మురుగు నీటి నిల్వ, దుర్వాసన తదితర సమస్యలకు మ్యాజిక్ డ్రెయిన్లు చక్కటి పరిష్కార మార్గం. సాధారణ సిమెంట్ డ్రెయిన్ల నిర్మాణంతో పోలిస్తే మ్యాజిక్ డ్రెయిన్లకు 80 శాతం నిర్మాణ వ్యయం కూడా ఆదా అవుతుంది. గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంతోపాటు పారిశుధ్యాన్ని ఈ మ్యాజిక్ డ్రెయిన్లు పెంపొందిస్తాయి. ప్రజలు ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించే వెసులుబాటు కల్పిస్తాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం, ఆంధ్రప్రదేశ్ ప్రజల అభివృద్ధి కోసం పవన్ కళ్యాణ్ భవిష్యత్తులోనూ ఇలాంటి ముందు చూపుతో కూడిన వినూత్న కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని, గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పవన్ కళ్యాణ్ దార్శనికత్వంలో గ్రామీణాంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నా నన్నారు.

## నేడు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం నిర్వహిస్తాం

**-కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



మచిలీపట్నం: మే 03 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఈ నెల 4వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక- కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు ఎవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ లు కూడా యధా విధంగా జరుగుతాయని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కలెక్టర్ కోరారు.

## "రూ.2 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాల స్విమ్మింగ్ పూల్ ప్రారంభం యువత క్రీడల్లో ప్రతిభ కనబర్చేలా శిక్షణ పొందాలి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి"



తాడేపల్లిగూడెం మే 3 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::తాడేపల్లిగూడెం పట్టణంలో రూ.2 కోట్ల సిఎస్ఆర్ నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన ఒలింపిక్ సైజు స్విమ్మింగ్ పూల్‌ను ఆదివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియు స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, శాప్ చైర్మన్ ఎ.రవి నాయుడు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం యువత కోసం ఈత పోటీలను కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, పి4 కార్యక్రమంలో భాగంగా నిర్మించిన ఈ స్విమ్మింగ్ పూల్ పట్టణానికి గర్వకారణమని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో, ఆర్వో ఫిల్ట్రేషన్ సిస్టమ్, శుభ్రత నిర్వహణ విధానాలతో నిర్మించబడిన ఈ సదుపాయం యువతకు అత్యుత్తమ శిక్షణ అందించేలా రూపొందించబడిందన్నారు. స్విమ్మింగ్ పూల్ నిర్వహణ బాధ్యతలను మున్సిపాలిటీ తీసుకుంటుందని, యువత అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని కోరారు. ఇలాంటి ఆధునిక సదుపాయం సమీప ప్రాంతాల్లో లేకపోవడం వల్ల ఇది ప్రత్యేకమైనదని, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని యువతకు సూచించారు. ఇతర పట్టణాలకు వెళ్లి శిక్షణ పొందాల్సిన అవసరం లేకుండా స్వస్థలంలోనే అవకాశాలు లభిస్తున్నాయని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని తెలిపారు.స్థానిక శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా యంత్రాంగం, స్థానిక నాయకుల సహకారంతో నిర్మాణం విజయవంతంగా పూర్తయిందన్నారు. ప్రభుత్వం క్రీడారంగాన్ని బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని, యువత అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోవాలని సూచించారు. గతంలో నిర్లక్ష్యం కారణంగా ఆలస్యమైన ఈ ప్రాజెక్ట్ ప్రస్తుత ప్రభుత్వంలో పూర్తి కావడం ఆనందదాయకమని తెలిపారు. ప్రజలు ఇకపై ప్రమాదకరమైన ప్రదేశాలకు వెళ్లకుండా సురక్షితంగా ఈత కొట్టే అవకాశం కలిగిందన్నారు.శాప్ చైర్మన్ ఎ.రవి నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తున్నదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అనేక క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, యువత వాటిలో చురుకుగా పాల్గొనాలని కోరారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రాయితీలు కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, ఉంగుటూరు శాసనసభ్యులు పచ్చమట్ల ధర్మరాజు, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, మండల రెవెన్యూ అధికారి టి.రాజరాజేశ్వరి, జనసేన నాయకులు బొలిశెట్టి రాజేష్, బీజేపీ ఇన్చార్జ్ ఈతకోట తాతాజీ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

## "కడియద్దలో వేడుకగా జలాభిషేకం"



తాడేపల్లిగూడెం మే 3 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::తాడేపల్లిగూడెం మండలం కడియద్ద లో శ్రీశ్రీశ్రీ మహంకాళమ్మ, మార్లమ్మ, పెద్దింట్లమ్మ పోతురాజుల జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం జలాభిషేక కార్యక్రమం గ్రామంలో అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అభిషేకం కోసం గ్రామంలో ఎంతో పవిత్రంగా భావించే కోనేరు నుంచి జలాలు తీసుకువచ్చి గ్రామం మొత్తం భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో ఆరేళ్ల వయసు చిన్నారి నుంచి 60 ఏళ్ల వృద్ధురాలి వరకు కలశాలతో భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో ప్రతి ఒక్కరు భాగస్వాములయ్యారు. రామాలయం సెంటర్లో ఏర్పాటుచేసిన అమ్మవార్ల గరగలకు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జాతర నిర్వహణ కర్త నీలం దుర్గారావు పర్యవేక్షించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో ఆనందంతో జలాభిషేకంలో పాల్గొన్న మహిళలకు గ్రామ జాతర కమిటీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## బీఎస్పీ 'చలో ఆకివీడు' పిలుపుతో గుడివాడలో పోలీసుల హైఅలర్ట్




గుడివాడ , మే 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఆకివీడులో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు రామాలయం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రకటించడంతో బిఎస్పీ ఛలో ఆకివీడు పిలుపు ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసుల ముందస్తు చర్యలు చేపట్టారు.గుడివాడ ఆకివీడుకు సమీపంలో ఉండటంతో స్పెషల్ పోలీస్ ఫోర్స్‌తో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.గుడివాడ పట్టణంలో పోలీసుల ప్రత్యేక పహరా - అనుమానితులపై నిఘా పెట్టారు.

## అప్రమత్తంగా ఉండాలి : వాతావరణ శాఖ అధికారుల హెచ్చరిక

అమరావతి, నేటి శుభోదయ ::: రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఎండతీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించారు.ఆదివారం నెల్లూరు జిల్లా గూడూరులో ఈ సీజన్లోనే అత్యధిక ఉష్ణోగ్రత 46.2, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 46.1 డిగ్రీలు రికార్డయ్యాయని ఆయన పేర్కొన్నారు. కడప జిల్లాలో 33 మండలాలు, నెల్లూరు 33, తిరుపతి 31, ప్రకాశం 28, పల్నాడు 25, మార్కాపురం 21, నంద్యాల 20, చిత్తూరు 20, కర్నూలు 18, బాపట్ల 16 మండలాలు మొత్తంగా 28 జిల్లాలకు గాను 16 జిల్లాల పరిధిలోని 286 మండలాల్లో ఎండ తీవ్ర ప్రభావం చూపి 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. సోమవారం రాష్ట్రంలో విజయనగరం జిల్లా : బొబ్బిలి, వంగర మండలాలుపార్వతీపురంమన్యం జిల్లా: బలిజపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం,పార్వతీపురం, సీతానగరం,వీరఘట్టం మండలాలు, పోలవరం జిల్లా: చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాలు. ఏలూరు జిల్లా : వేలేరుపాడు మండలం. ఎన్టీఆర్ జిల్లా : ఇబ్రహీంపట్నం, కంచికచర్ల.గుంటూరు జిల్లా : మంగళగిరి, మెడికొండూరు, ఫిరంగిపురం, తాడికొండ, తాడేపల్లి, తుళ్లూరు మండలాలు.పల్నాడు జిల్లా : అమరావతి, పెదకూరపాడు మండలాలు. నెల్లూరు జిల్లా : మనుబోలు, గూడూరు మొత్తంగా 27మండలాల్లో వడగాలులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఆదివారం నెల్లూరు జిల్లా గూడూరులో 46.2డీసి, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 46.1డీసి, మార్కాపురం(జి) కంభం లో 45.7డీసి, తిరుపతి(జి) బోనుపల్లెలో 45.6డీసి, పల్నాడు(జి) నడిగడ్డలో 44.2డీసి, బాపట్ల(జి) కారంచేడులో 44డీసి, కర్నూలు(జి) తోవిలో 43.9డీసి, చిత్తూరు(జి) తవణంపల్లెలో 43.8డీసి, అనంతపురం(జి) తెరన్నపల్లి, కడప(జి) వీరబల్లెలో 43.4డీసి, నంద్యాల(జి) బనగానపల్లె, ఎన్టీఆర్(జి) చిలకల్లులో 43.1డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు.మరోవైపు దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా కొమోరియన్ ప్రాంతం వరకు ద్రోణి విస్తరించి ఉందని ఎపిఎస్డీఎంఎ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో సోమవారం అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం,అల్లూరి, పోలవరం,విశాఖ, చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నాటికి కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 72.7మిమీ, కాట్రేనికోనలో 57.7మిమీ, కాకినాడ జిల్లా పెద్దాపురంలో 50.2మిమీ, పిఠాపురంలో 45.5మిమీ, కాకినాడ రూరల్ 43మిమీ, అచ్చుతాపురంలో 42మిమీ, కాకినాడ అర్బన్ 41మిమీ వర్షపాతం నమోదైందన్నారు.

## 'జగన్మాత సన్నిధిలో భక్తులరద్దీ '



విజయవాడ, మే 3 (నేటి శుభోదయ):- వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రిపై ఆదివారం రద్దీ నెలకొంది. ఉదయం 9 నుండే 500/- దర్శనం టికెట్ల అమ్మకాలు నిలుపుదల చేసి, అంతరాలయ దర్శనం పూర్తి స్థాయిలో నియంత్రణ చేశారు.ఆలయ సిబ్బంది భక్తుల రద్దీ క్రమబద్ధీకరణ చేశారు.వివిధ ఆర్జిత సేవల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.రద్దీ పరిస్థితి గమనించి భక్తులందరికి శ్రీ దుర్గామల్లేశ్వరుల దర్శనం సులభతరంగా పూర్తి అవ్వాలనే ధ్యేయంతో దేవాలయ సిబ్బంది క్యూ లైన్ల క్రమబద్ధీకరణ, రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టారు.దేవస్థానం ఆధ్వర్యంలో సేవకుల ద్వారా మంచి నీరు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు భక్తులకు పంపిణీ చేయడమైనది.దేవస్థానం ఈ.ఓ వి.కె.శీనానాయక్ దుర్గా ఘాట్ పరిశీలన చేసి, భక్తులకు అందుతున్న సౌకర్యాల గురించి, ఘాట్ అభివృద్ధి పనులు గురించి ఇంజినీరింగ్ అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు.అక్కడ నుండి కాలినడకన మహా మండపం చేరుకొని మెట్ల ద్వారా ప్రధాన ఆలయానికి చేరుకునే క్రమంలో వివిధ అంతస్తుల్లో మంచి నీటి సదుపాయాలు, మరుగుదొడ్లు పరిశీలన చేసారు.5వ అంతస్తులోని దుకాణాలు పరిశీలించి, హద్దు అతిక్రమిస్తున్న వారిని హెచ్చరించారు.శ్రీ అమ్మవారికి మధ్యాహ్న నైవేద్యం సమర్పణ తరువాత భక్తులరద్దీ తీవ్రంగా పెరిగడంతో ఘాట్ రోడ్ వైపు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలుపుదల చేసారు.మెడిసిన్ నీట్ పరీక్ష వ్రాయబోతున్న విద్యార్థులు తమ హాల్ టికెట్స్ సన్నిధిలో ఉంచి, జగన్మాతను వేడుకున్నారు.గుణదల, ఏలూరు రోడ్ దేవస్థానం సిబ్బంది క్వార్టర్స్ ను ఈవో శీనా నాయక్, ఇంజినీరింగ్ అధికారులు పరిశీలన చేశారు.సిబ్బంది విన్నపం మేరకు స్థానికంగా ఉన్న ఇబ్బందులను ఈవో పరిశీలన చేశారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవలసినదిగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీమతి ఎల్. రమాదేవి ని ఈవో ఆదేశించారు.

## అమ్మవారికి బంగారు గాజులు




విజయవాడ, మే 3 (నేటి శుభోదయ):- శ్రీ కనక దుర్గమ్మ వారికి హైదరాబాద్ కు చెందిన శ్రీమతి ఎం. పి. డి. కళ్యాణి దంపతులు 24 గ్రాముల బంగారు గాజులను సమర్పించారు.ఆదివారం మధ్యాహ్నం దేవస్థానంకు విచ్చేసి ఆలయం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ )సమక్షంలో ఆభరణం అందించారు.ఈ సందర్భంగా దాత కుటుంబీకులకు ఆభరణం పొందినట్లుగా దేవస్థానం నుండి రశీదు అందజేసి,శ్రీ అమ్మవారి దర్శనం, ఆశీర్వచనం ఏర్పాటు చేసి, చిత్రపటం, ప్రసాదాలను దేవస్థానం వారు అందజేసారు.

## ఎగ్జిబిషన్లో అగ్నిమాపక చర్యలు కచ్చితంగా పాటించాలి




విజయవాడ, మే 3 (నేటి శుభోదయ):- ఎగ్జిబిషన్లో అగ్నిమాపక చర్యలను తప్పకుండా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ అన్నారు. ఆదివారం ఉదయం సితార సెంటర్, పున్నమి ఘాట్ భవానిపురం ప్రాంతాలలో ఉన్న ఎగ్జిబిషన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్ నిర్వహణలో అగ్నిమాపక చర్యలు కచ్చితంగా పాటించాలని ఎటువంటి అగ్నిప్రమాదం జరగకుండా ప్రతిచోట ప్రతిష్టాల్లో కచ్చితంగా నివారణ చర్యలు పాటించాలని ప్రతిష్టాలు పైన అత్యవసర నంబర్లను సూచించాలని, ఎగ్జిబిషన్ ప్రాంగణంలో అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లే దారిని సూచించే సూచనలను ఏర్పాటు చేయడమే కాకుండా ఎల్లప్పుడూ బయటకు వెళ్లే మార్గంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా చూసుకోవాలని అన్నారు. ఎగ్జిబిషన్ స్టాల్స్ లోపల వంట వండేందుకు ఎటువంటి వంట పరికరాలు కానీ మంట పరికరాలు కానీ ఉంచరాదని, అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు పాటించే ప్రాంతంలో మాత్రమే ఒక కామన్ కిచెన్ ఏర్పాటు చేసుకుని వంట వండే ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు అధికారులు సూచించారు. సురక్షితంగా లేని, లూస్ గా ఉన్న ప్రమాదకరమైన విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని, ఎగ్జిబిషన్లో ఉన్న వివిధ స్టాల్స్ లో ఉండేవారికి తరచూ అగ్నిమాపక చర్యలు పై మోక్ డ్రిల్ ను నిర్వహిస్తూ ఎటువంటి ప్రమాదం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఎగ్జిబిషన్ నిర్వాహకులకు అధికారులు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో విజయవాడ నగర పాలక సంస్థ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ తో పాటు కొత్తపేట స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక




విజయవాడ, మే 3 (నేటి శుభోదయ):- ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలలో తో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## శ్రీశ్రీశ్రీ దుర్గా మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో

### ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం




విజయవాడ, మే 3 (నేటి శుభోదయ):- కండ్రికలోని శ్రీశ్రీశ్రీ దుర్గా మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, నవధాన్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా మాత్రమే కాకుండా సమాజంలో సానుకూల శక్తిని పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. ఇలాంటి పవిత్ర కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడమే కాకుండా సామాజిక ఐక్యతకు కూడా దోహదపడతాయని పేర్కొన్నారు.దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు, భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బొండా ఉమా




విజయవాడ, మే 3 (నేటి శుభోదయ):- 30వ డివిజన్ రామకృష్ణపురం బుడమేరు బ్రిడ్జి పైన విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో ధాత గొట్టుముక్కల వెంకటేశ్వరరాజు (వెంకీ) ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హాజరై, అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎండలు తీవ్రంగా మండిపోతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి సెంట్రల్ నియోజకవర్గంలో అన్ని విధాల చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వడగాల్పులపై ఎప్పటికప్పుడు అలర్టు జారీ చేస్తూ, ఉష్ణోగ్రత అంచనాలను ప్రజలకు మెసేజ్‌ల ద్వారా తెలియజేస్తూ, ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవసరమైన సూచనలు అందిస్తున్నామని.ప్రభుత్వం తరపున ప్రధాన ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రయాణికులు, కార్మికులు, ఆటో డ్రైవర్లు మరియు రోడ్డుపై పనిచేసే మహిళలకు మజ్జిగ, చల్లని తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ఎండ తీవ్రత మధ్య ప్రజలకు ఉపశమనం కలిగించేలా ఈ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని.అల్లూరి సీతారామరాజు సర్కిల్ వద్ద క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నెలరోజుల పాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, ఈ మార్గంలో ప్రయాణించే ప్రతి ఒక్కరికీ ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ సెంటర్‌కు "అల్లూరి సీతారామరాజు" పేరు తాను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో కౌన్సిల్‌లో తీర్మానం చేసి పెట్టించామని, క్షత్రియ సంఘం పెద్దల సహకారంతో ఇక్కడ ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించామని ఉమా గుర్తుచేశారు.ప్రతి సంవత్సరం అల్లూరి సీతారామరాజు జయంతి, వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన క్షత్రియ సంఘం అధ్యక్షుడు బ్రహ్మరాజు, అలాగే సభ్యులు, నాయకులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఇలాంటి సేవా కార్యక్రమాలను కమ్యూనిటీ ఆర్గనైజేషన్స్, ఎన్‌జీఓలు, లయన్స్ క్లబ్బులు, రోటరీ క్లబ్బులు మరింతగా ముందుకు వచ్చి నిర్వహించాలని, ప్రజలకు సేవ చేయడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉమా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు పెనుమత్స అప్పలరాజు, వలివర్తి దుర్గాప్రసాద్, విజయరామరాజు, వలివర్తి రామరాజు, యువజన సంఘం అధ్యక్షులు కాకర్లపూడి బ్రహ్మరాజు, కార్యదర్శి ఉప్పలపాటి మురళి, వైస్ ప్రెసిడెంట్ దాట్ల రాజేష్ వర్మ, కల్లేపల్లి నాగరాజు, దాట్ల శశి, డి.ఎస్.ఎన్ రాజు తదితరులు , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## హజ్ యాత్ర ముస్లిం ప్రజలకు పరమ పవిత్రమైంది



పెదన మే 3 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) హజ్ యాత్ర ముస్లింలకు పరమాపవిత్రమైనదని పెదన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు.ఆదివారం ఐదవ వార్డ్ వాస్తవ్యులు, పట్టణ తెలుగుదేశం పార్టీ సెక్రెటరీ బాజిద్ బేగ్(అల్లా బక్షు) మక్కా యాత్రకు వెళుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో నేపథ్యంలో వారికి శుభాభినందనలను శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, కూటమి నాయకులు హజ్ అంటే ముస్లింల పుణ్యక్షేత్రమైన మక్కా నగరానికి తీర్థయాత్ర చేయడం. ఇస్లాం ఐదు మూలస్థంభాలలో ఐదవదని, ప్రతి ముస్లిం తన జీవితకాలంలో కనీసం ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలన్నారు. అటువంటి యాత్ర కి వెళుతున్న బాజిద్ బేగ్(అల్లా బక్షు) అదృష్టవంతులని అన్నారు.

## సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులను పరిశీలించిన లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్



బాపట్ల నేటి శుభోదయ మే 3: పర్యాటక రంగంలో బాపట్ల జిల్లాను అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ మరియు బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం నాడు ఆయన బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు మరియు జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ గారితో కలిసి సూర్యలంక తీరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మరియు కలెక్టర్ గారు బీచ్ తీరంలో పర్యాటకుల సౌకర్యార్థం చేపడుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పర్యాటక శాఖాధికారులు మరియు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

## "రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి"



పెంటపాడు; మే 3 (అవినాష్ మారంపూడి నేటి-శుభోదయ):పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామ పరిధిలోని రైల్వే గేటు వద్ద ప్రతిపాదితంగా నిర్మించనున్న రోడ్ అండర్ బ్రిడ్జ్ (ఆర్ యు బి) నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్.యు.బి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, ట్రాఫిక్ సౌకర్యాల మెరుగుదల, స్థానిక ప్రజలకు కలిగే ప్రయోజనాలు వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రస్తుత రైల్వే గేటు వద్ద తరచుగా ఏర్పడే ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ఈ ఆర్.యు.బి నిర్మాణం కీలకమని అధికారులు వివరించారు. అయితే, ప్రతిపాదిత నిర్మాణం కారణంగా గ్రామంలోని పంచాయితీ మంచినీటి చెరువు కొంత భాగం ప్రభావితమయ్యే అవకాశం ఉందని, అదేవిధంగా సుమారు 32 గృహాలకు నష్టం కలగవచ్చని అధికారులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశాలపై సవివరంగా అధ్యయనం చేసి, ప్రభావిత ప్రాంతాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని తహసిల్దార్‌ను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అంతేకాకుండా, సంబంధిత శాఖల మధ్య సమన్వయం కల్పించి, ప్రజలకు తక్కువ నష్టం కలిగే విధంగా ప్రణాళికను రూపొందించాలని సూచించారు. అవసరమైతే పునరావాస చర్యలు కూడా పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు.ఈ పరిశీలన కార్యక్రమంలో పెంటపాడు తహసిల్దార్ సునీల్ కుమార్, విఆర్వో భువన, మండల సర్వేయర్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.


## నందమూరి వారసులుగా సమాజానికి సేవలు అందించేందుకు సిద్ధం

### -నందమూరి మోహనకృష్ణ




నిమ్మకూరు, ,మే 3 (అజయ్ నారగాని - నేటి శుభోదయ )నందమూరి తారక రామారావు వారసులు గా వారి ఆశయాలు నెరవేర్చటానికి కుటుంబ సభ్యులమైన మేము మా వంతు సేవలు సమాజానికి అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఎన్.టి.ఆర్. తనయుడు నందమూరి మోహన కృష్ణ వెల్లడించారు, నందమూరి తారక రామారావు, బసవ రామ తారకం గార్ల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం ఎన్టీఆర్ స్వగ్రామం పామర్రు మండలం నిమ్మకూరు గ్రామానికి మోహన కృష్ణ, వారి కుమార్తె మోహన రూప విచ్చేసారు. తొలుత ఎన్టీఆర్ బసవ రామ తారకం విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు, అంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు, అర్చకులు సుదర్శనం లక్ష్మి నర్సింహా చార్యులు శేష వస్త్రాలు తో శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాద సేవ ట్రస్ట్ కార్యదర్శి నందమూరి జయ శంకర్ ప్రసాద్, కోశాధికారి పి. ఎం ఎస్. ప్రసాద్, ట్రస్టీ నందమూరి శివరామ కృష్ణ,గ్రామ శివాలయం ఇ ఓ జన్ను వేంకటేశ్వర రావు తదితర గ్రామ ప్రముఖులు మోహన్ కృష్ణ, మోహన్ రూప లను సన్మానించ్చారు. నందమూరి మోహన కృష్ణ కుటుంబ సభ్యుల వితరణ తో ఎన్టీఆర్ బసవ రామ తారకం ల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ సందర్భంగా మోహన్ కృష్ణ, మోహన్ రూప లు స్వయంగా భక్తులకు భోజనం వడ్డన చేసి, ఆనందపరిచారు. ఈ సందర్భంగా ఎన్.టి.ఆర్. అభిమాన సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు మన్నె సోమేశ్వరరావు రచించిన ఎన్.టి.ఆర్. సినీ ప్రస్థానం పుస్తకాన్ని మోహన కృష్ణ, మోహన రూప లకు అందచేశారు.





# బెజవాడకు వివిఐపి కాన్వాయ్ ల నుంచి విముక్తి




అమరావతి, నేటి శుభోదయ ::: చీకటి పడిన తర్వాత వెస్ట్ బైపాస్ లో వస్తుంటే బాంబు డిస్పోజల్ స్క్వాడ్ చీకట్లో రోడ్డు మార్జిన్ లో తనిఖీ చేస్తూ కనిపించారు. అర కిలో మీటర్ దూరంలో మరో టీమ్. తర్వాత మరో కొద్ది దూరంలో కానిస్టేబుల్, ఒక చోట మహిళా ఎస్సైతో పాటు చీకట్లో ఆమెకు తోడుగా ఆమె భర్త. విషయం అర్థం అయ్యింది. వాళ్ళతో మాటలు కలిపితే రెండు గంటలుగా ఎదురు చూస్తున్నట్టు చెప్పారు. పోలీస్ డ్యూటీలో అవన్నీ భాగం కాబట్టి చేయగలిగింది ఏమీ లేదు. మహిళా కానిస్టేబుల్స్ కూడా చిమ్మ చీకట్లో ఒంటరిగా నిలబడి ఉన్నారు. కొందరి దగ్గర వాకీ టాకీలు కూడా లేవు. యూనిఫామ్ లో ఉన్నారనే ధైర్యంతో అలా నిలబడి ఉన్నారు.

**- విజయవాడకు వీడిన గ్రీన్ ఛానల్ కష్టాలు**

పోలీస్ సిబ్బందితో మాట్లాడిన తర్వాత వెస్ట్ బైపాస్ అందుబాటులోకి వచ్చాక నగరం మీద ఒత్తిడి తగ్గినట్టు అర్థం అయ్యింది. వివిఐపి రాకపోకల కోసం నగరంలో పదేళ్లుగా నిత్య నరకంగా ఉండేది.వెస్ట్ బైపాస్ పూర్తి కావడంతో నగరంలోకి రాకుండా గన్నవరం విమానాశ్రయం నుంచి నేరుగా ఉండవల్లి - వెంకటపాలెం వరకు వాహనాలు వెళ్లిపోతున్నాయి. గన్నవరం విమానాశ్రయం నుంచి 35నిమిషాల ప్రయాణంతో ఉండవల్లి వరకు చేరొచ్చు. సీఎం కాన్వాయ్ రాకపోకలకు వెస్ట్ బైపాస్ వినియోగం వల్ల నగరంలో ట్రాఫిక్ ఇక్కట్లు తగ్గిపోయాయి. నైనవరం దగ్గర మాత్రమే ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. హై టెన్షన్ లైన్ మళ్లింపు పూర్తి కాకపోవడంతో అండర్ పాస్ నుంచి పయనిస్తున్న వాహనాలు.గత పదేళ్లుగా సీఎం ల రాకపోకల కోసం విజయవాడ నగరంపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. కనకదుర్గ వారధి, ప్రకాశం బ్యారేజ్ మార్గాల నుంచి వివిఐపి ల రాకపోకలు సాగుతుండేవి.గ్రీన్ ఛానల్ కోసం సాధారణ ట్రాఫిక్ ఆపేసి కాన్వాయ్ లకు అనుమతి ఇచ్చేవారు. మండే ఎండలు, వరదలు, వర్షాలు అయినా ఇవి మారేవి కాదు కొద్ది వారాలుగా నగరంలో తగ్గిన వివిఐపి వాహనాల తాకిడి తగ్గింది. మహిళా పోలీస్ సిబ్బందిని రాత్రి పూట కాన్వాయ్ పెట్రోలింగ్ విధులు నుంచి మినహాయించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలించాలి.

# మంత్రి పొంగులేటి ఇలాకాలో ధాన్యం కోనుగోలు లో అడుగు అడుగున జాప్యంమే



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఒక పక్క గాలి దుమారం, మరోవైపు వాతావరణం లో నెలకొన్న మార్పులతో రైతన్నల గుండె గుబులే మంటూ బావురు మంటూ భయాందోళనలకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే... తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజక వర్గంలోని పరిస్థితిని పరిశీలిస్తే ప్రతి రైతుది ఆవేదన అంతా ఇంతా కాదు మరి. ఈ ఏడాది మొక్కజొన్న పండించిన రైతు పరిస్థితి అత్యంత బాధాకరమైన విషయం గా మారుతోంది. అకాల వర్షంతో మొక్కలు, ధాన్యం ఎక్కడ తడిసి ముద్ద అయిపోతుందో అర్థం కాని పరిస్థితి. మొక్కజొన్నలను కొనుగోలు చేయాలి అని రోజుల తరబడి రైతులు వేచి చూసి కండ్లు కాయలు కాచే విధంగా ఉందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని ఆదివారం సాయంత్రం వచ్చిన గాలి దుమారం తో రైతన్నలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం నగరానికి కూత వేటు దూరంలో ఉన్న ఖమ్మం, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు గా బాధ్యతలు స్వీకరించిన ఇరువురు సైతం అటువైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో రైతుల బాధలు వర్ణనాతీతం అని చెప్పక తప్పదు. ఆదివారం అకాల వర్షం కురిస్తున్న తమ ధ్యానం , మొక్కలు తడిసి ముద్ద అయిపోతుందో అనే భయంతో గుండె ఆగినంత పనైంది అని రైతులు లబోదిబోమంటున్నారు. మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఉన్న ధాన్యం, మొక్క జొన్నలను ప్రభుత్వం మద్దతు ధరకు తక్షణమే కొనుగోలు చేయాలని రోజుల తరబడి రైతులు వేచి చూడాల్సిందే అంటున్నారు అధికారులు. ఖమ్మం జిల్లాలో వచ్చిన గాలి దుమారం కారణంగా మార్కెట్ యార్డులో అమ్మకానికి రైతులు తెచ్చిన ధాన్యం మొక్కజొన్నలు పూర్తిగా ఎక్కడ తడిసిపోతాయనే ఆందోళన వ్యక్తం చేశారు రైతులు. వెంటనే మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉండగా కొనుగోలు చేయకుండా మీనమేషాలు లెక్కేస్తుందని ఆరోపించారు. ఈ కారణంగా రైతులు తమ తమ దిగుబడులను ప్రైవేటు వ్యాపారులకు తెగనమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కొందరు రైతులు మార్కెట్ యార్డులో తమ దిగుబడులను పెట్టి పడిగాపులు కాస్తుంటే అకాల వర్షానికి ధాన్యం మొక్కజొన్నలు పూర్తిగా తడిసిపోతాయాయనే ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తమ ధాన్యం, మొక్కజొన్న దిగుబడులను మార్కెట్ యార్డుకు అమ్ముకునేందుకు తెచ్చినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయటం లేదని పేర్కొన్నారు. అకాల వర్షాల కారణంగా మొక్కజొన్నలకు పూర్తిగా తడిసిపోతాయాయని అవి తడవకుండా అవసరమైన చర్యలను మార్కెట్ యార్డ్ సిబ్బంది చేయకపోవటమే కారణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్దతు ధరకు తడిసిన ధాన్యాన్ని మొక్కజొన్నలను సైతం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. పేరుకే ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న రైతుల ఇబ్బందులను తొలిగించే పరిస్థితి లేదు అనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ముగ్గురు మంత్రులు, అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించడం వైపు అడుగులు వేయాలని కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పని చేసే మార్కెట్ అధికారుల తీరు ముచ్చట వేస్తోంది. స్వయానా జిల్లా కలెక్టర్ ధాన్యం కోనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కనీసం మార్కెట్ అధికారుల్లో ఎలాంటి మార్పు రాకపోవటం శోచనీయం. అటు మంత్రి పొంగులేటి, ఇటు జిల్లా కలెక్టర్ అన్న వారికి చీమ కుట్టినట్లు గా కూడా లేదు అని చెప్పక తప్పదు. ఇక్కడ పని చేసే అధికారులపై

## తెలంగాణలో న్యూట్రిషన్ నెక్ట్స్ తయారీ ప్లాంటు




హైదరాబాద్: పెంపుడు జంతువుల ఆహారోత్పత్తులకు సంబంధించి తెలంగాణలోని వర్గల్‌లో అత్యాధునిక తయారీ కేంద్రాన్ని 2027 ఆర్థిక సంవత్సరం నాటికి ప్రారంభించనున్నట్లు న్యూట్రిషన్ నెక్ట్స్ సహ వ్యవస్థాపకులు వెంకట ధర్మేంద్ర బొప్పన తెలిపారు. కొత్తగా పిల్లుల కోసం పేరెంట్ పేరిట, శునకాల కోసం బోనస్ పేరిట ట్రీట్స్ ఆహారోత్పత్తులను ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన ఈ విషయం తెలిపారు. అంతర్జాతీయ పోషకాహార ప్రమాణాలకి అనుగుణంగా వీటిని తయారు చేస్తున్నట్లు చెప్పారు. 2027 నాటికి పెంపుడు జంతువుల సంరక్షణ ఉత్పత్తుల మార్కెట్ వార్షికంగా 5.2 శాతం వృద్ధి రేటుతో 8.6 బిలియన్ డాలర్ల స్థాయికి వృద్ధి చెందనుందని వ్యవస్థాపకుడు, సీఈవో సి. ప్రహర్ష తెలిపారు. తెలిపారు. ఇందులో ఆహారం, ట్రీట్స్ విభాగం గణనీయంగా వృద్ధి చెందుతోందని, 2.52 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందనే అంచనాలు ఉన్నాయని వివరించారు. కార్యకలాపాలు ప్రారంభించిన తొలి ఏడాదిలోనే రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పుణె, ముంబై తదితర ఐదు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాల్లోను విస్తరించినట్లు చెప్పారు.

## ట్రంప్, నెతన్యాహులను వెంటాడుతున్న హిట్లర్ భూతం



కొచ్చి: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహులను హిట్లర్ భూతం వెంటాడుతోందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ విమర్శించారు. ట్రంప్, కింకరస్ల చర్యలు ప్రపంచాన్ని తమ కాళ్ల కిందకు తెచ్చుకోవడానికి ప్రయత్నించడం లాంటివని ఆయన అన్నారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్ ఈ సామ్రాజ్యవాద విధానాలకు సేవకులని ఆయన పేర్కొన్నారు. వారి విధానాలను బట్టబయలు చేయాలని కూడా బేబీ తెలిపారు. 'అమెరికన్ యుద్ధోన్మాదం – – మారుతున్న ప్రపంచం' అనే అంశంపై ఎర్నాకులం ఈఎంఎస్ స్టడీ అండ్ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన ఒక సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు అన్ని అంతర్జాతీయ చట్టాలను బేషరతుగా ఉల్లంఘిస్తూ దాడులు చేస్తున్నాయని మండిపడ్డారు. దీనిపై భారతదేశం నుండి ఎలాంటి స్పందన లేదని, చేయాల్సింది చేయలేదని పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడి జరిగినప్పుడు మౌనం వహించిందని తెలిపారు. ఈ దాడులు ఒక స్పష్టమైన లక్ష్యంతో జరిగాయని, సైనిక, రాజకీయ ఆధిపత్యాన్ని స్థాపించడం, అలాగే సహజ వనరులను దోచుకోవడం వంటివి వాటి లక్ష్యాలలో ఉన్నాయన్నారు. మానవాళిని దోపిడీ పట్టులో ఉంచే ప్రయత్నంలో భాగంగానే ఇవి జరుగుతున్నాయని ఎం.ఎ. బేబీ అన్నారు. ఈ కార్యక్రమానికి ఈఎంఎస్ స్టడీ అండ్ రీసెర్చ్ సెంటర్ చైర్మన్ ఎస్. సతీష్ అధ్యక్షత వహించారు. డాక్టర్ ధర్మరాజ్ అటాట్ రచించిన పుస్తకంతో పాటు స్టడీ అండ్ రీసెర్చ్ సెంటర్ రూపొందించిన మరో పుస్తకాన్ని ఎం.ఎ. బేబీ విడుదల చేశారు. కార్యక్రమంలో సిఎం దినేష్మణి, కెవి థామస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ సమీక్ష



హైదరాబాద్: గాంధీభవన్ లో మాజీ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ గారి ఆధ్వర్యంలో మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ లు మరియు కోఆర్డినేటర్లు విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఎన్నికల సంఘం చేపట్టిన "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ " కార్యక్రమంపై లోతైన చర్చ జరిపి, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ గారు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అత్యంత కీలక అంశమని పేర్కొన్నారు. మల్కాజ్గిరి కార్పొరేషన్ లో ఎక్కడా దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు ఉండకుండా ప్రతి బూత్ స్థాయిలో పర్యవేక్షణను బలోపేతం చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్ర స్థాయిలో కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, సవరణలు వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని, యువత, మహిళలు మరియు కొత్తగా అర్హత పొందిన వారిని ప్రత్యేకంగా గుర్తించి నమోదు చేయించాలన్నారు. ఈ దిశగా పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. బూత్ స్థాయిలో సమర్థవంతమైన వ్యవస్థ కోసం వెంటనే "బూత్ లెవల్ అసిస్టెంట్స్ " నియామకాన్ని పూర్తి చేసి, వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రతి కార్యకర్త ఈ బాధ్యతను కర్తవ్యంగా భావించి పనిచేస్తేనే భవిష్యత్ ఎన్నికల్లో విజయానికి బలమైన పునాది పడుతుందని స్పష్టం చేశారు,మరియు డివిజన్ అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ కూడా పూర్తి చేయాలని అన్నారుఈ కార్యక్రమంలో మధుయాష్కి గారు,జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ గారు,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ పరమేశ్వర్ రెడ్డి గారు. ఉప్పల్ నియోజకవర్గం కోర్డినేటర్ శశికళ యాదవ్ గారు,బండి రమేష్ గారు,కోలన్ హనుమంత్ రెడ్డి గారు,తదితరులు పాల్గొన్నారు

## ఎరువులు కొనాలంటే యాప్..
## వడ్లు కొనాలంటే ఆన్‌లైన్..
## రైతుల ఇబ్బందులపై హరీశ్‌రావు ఆగ్రహం




**హైదరాబాద్, :** కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు కానీ ఒక్క గింజ కూడా ప్రభుత్వం కొనడం లేదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మల్లారం వద్ద సిద్దిపేట-కరీంనగర్ రాజీవ్ రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. రైతులకు సంఘీభావంగా హరీశ్‌రావు ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 28 రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదంటూ రైతులు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. మొక్కజొన్న రైతులకు గన్నీ బ్యాగులు లేకపోతే రైతులు సొంతంగా బ్యాగులు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. 22 రోజులుగా సన్ ఫ్లవర్ గింజలను కొనుగోలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే కలెక్టర్లకు ఆర్డర్ ఇచ్చి వడ్ల కొనుగోలును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పారని.. అది కాస్త బోగస్ అయ్యిందని హరీశ్‌రావు విమర్శించారు. ఎరువులు కొనాలంటే యాప్ కావాలి.. వడ్లు కొనాలంటే ఆన్‌లైన్ కావాలి అంటూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని మండిపడ్డారు.


# అక్షరాలా నిప్పుల కొలిమి



ప్రతియేటా ఇంచుమించు మే నెల మొదటి వారానికిగానీ ఉగ్రరూపం దాల్చని మార్తాండుడు ఈసారి ఫిబ్రవరి నెలాఖరునాటికే చెలరేగడం మొదలెట్టాడు. ముందే రావటం, దీర్ఘకాలం తిష్టవేయటం కొన్నాళ్లుగా కనబడుతున్నా ఈ స్థాయిలో ఎండలు మండిపోవటం ఇదే తొలిసారి. మన దేశంలో రుతువులు గతి తప్పి చాన్నాళ్లయింది. గతంలో పొద్దుటిపూట ఒక రకం, రాత్రికి మరో రకం వాతావరణం దర్శనమిచ్చేవి. ఎంత ఎండాకాలమైనా రాత్రికి ఎటునుంచో వచ్చి చల్లని గాలులు తాకేవి. సేదతీర్చేవి. ఇప్పుడు రాత్రింబగళ్లు తేడా లేదు. వేడిగాలుల వెనకే హఠాత్తుగా వాతావరణం మారి, జల్లులు మొదలై వడగళ్లు పడటం రివాజుగా మారింది. అటు తర్వాత కాసేపటికే ఉక్కబోత మొదలవుతోంది. ప్రకృతికి సంబంధించినంతవరకూ ఉత్తర దక్షిణాలన్న తేడా... మధ్య, పశ్చిమ భారత్‌లన్న వ్యత్యాసం లేదు. వాతావరణ శాస్త్రజ్ఞులు చెబుతున్నదాన్నిబట్టి ప్రస్తుతం 23 రాష్ట్రాలకు వడగాడ్పుల తాకిడి ఉంది. అందులో డజనుకుపైగా తీవ్ర వడగాడ్పులను చవిచూస్తున్నాయి. వందలాది నగరాలు భరించలేనంత ఉక్కబోతతో విలవిల్లాడుతున్నాయి. అయితే దక్షిణ ద్వీపకల్ప ప్రాంతం, ఈశాన్య రాష్ట్రాలూ ఇప్పటికైతే ఈ సమస్యకు దూరంగా ఉంటున్నాయి. కానీ పర్యావరణంలో వస్తున్న మార్పుల పర్యవసానంగా భవిష్యత్తులో ఇవి సైతం భానుడి ప్రతాపాన్ని చవిచూడకతప్పదని వాతావరణ శాస్త్రవేత్తలు జోస్యం చెబుతున్నారు. సాధారణ ఉష్ణోగ్రతలకన్నా కనీసం 5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువుంటే, అది వరసగా రెండ్రోజులు కొనసాగితే వడగాడ్పులు వీస్తున్నట్టు లెక్కేస్తారు. అది 7 డిగ్రీల సెల్సియస్‌కి మించి పెరిగితే తీవ్ర వడగాడ్పులుగా పరిగణిస్తారు. ఒక ప్రాంతం మైదానమా, కొండలతో ఉందా అనే అంశాన్ని కూడా ఈ విషయంలో పరిగణనలోకి తీసుకుంటారు. బొంబాయి ఐఐటీ ఇటీవల చేసిన అధ్యయనంలో గంగా--సింధు మైదానం (ఉత్తర భారతం)లో వేడిగాలులకు స్థానిక నేలలు, ఇతర వాతావరణ పరిస్థితులు కారణమని తేల్చింది. వెలుపలినుంచి వచ్చే వేడిగాలులే ఇందుకు దోహదపడుతున్నాయన్న అభిప్రాయాన్ని తోసిపుచ్చింది. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రత పెరగడంతో వేడిగాలులు భూ ఉపరితలానికి దగ్గరగా ఉండిపోతున్నాయి. నగరాల్లోని కాంక్రీట్ కట్టడాలు, తారురోడ్లు పగలంతా తీవ్ర ఉష్ణోగ్రతను స్వీకరించి, రాత్రికి సైతం సెగలు కక్కుతూనేవుంటున్నాయి. అందుకే ఇంతచేటు తీవ్రత! వరదలు, తుపానులు, భూకంపాల్లాగే వడగాడ్పులు కూడా ప్రకృతి వైపరీత్యమే. కానీ ప్రభుత్వాలు ఒప్పుకోవు. వడగాడ్పులవల్ల ఏటా వందలాది మరణాలు సంభవిస్తున్నా, ఆ విధంగా లెక్కేయటానికి తగిన విధానం రూపొందలేదు. సాధారణంగా శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారన్‌హీట్ లేదా అంతకన్నా ఎక్కువకు చేరి, శరీరంలో చెమట పట్టడం ఆగిపోయి చర్మం పొడిబారి ఎర్రగా మారితే, స్పృహ కోల్పోవటం లేదా మతిస్థిమితం తప్పడం, మూర్ఛరావడం వంటివి కనబడితే వడగాడ్పు మరణమని చెబుతారు. వీటికితోడు బాధితుడున్న ప్రాంతంలో వడగాలుల హెచ్చరిక ఉందా, అతను మరణించటానికి ముందు ఎండలో పనిచేశాడా లేదా అనేవి కూడా చూస్తారు. ఆ తర్వాతే వడగాడ్పు మరణంగా నిర్ధారిస్తారు. గుండెజబ్బు వగైరాలున్నా, వృద్ధాప్యంలో ఉన్నా ఆ జాబితాలో లెక్కేయరు. ఈ విషయంలో ప్రభుత్వాల వైఖరి మారాలి. వేసవిలో మరణాల రేటు గత కొన్నేళ్లలో ఎలావుందో చూసే విధానాన్ని అంతర్జాతీయంగా అనుసరిస్తున్నప్పుడు మనం మాత్రం ఎందుకు ఆ కొలమానాన్ని తీసుకోవటం లేదు? పదహారో ఆర్థిక సంఘం నిరుడు ఇచ్చిన నివేదికలో వడగాడ్పుల్ని, పిడుగుపాటుల్ని కూడా ప్రకృతి విపత్తులుగా పరిగణించాలని కోరింది. చాలా రాష్ట్రాలు ఎన్నో ఏళ్లుగా ఈ విషయంలో డిమాండ్ చేస్తున్నాయి. అలా లెక్కేస్తే అందుకు సంబంధించిన నిధుల్ని సహాయ కార్యక్రమాల కోసం వ్యయం చేయటానికి, బాధితులకు తక్షణ సాయం అందించటానికి వీలవుతుంది. వడగాడ్పులున్న ప్రాంతాల్లో భవన నిర్మాణం, సాగుపనుల సమయాలను మార్చటానికి, విద్యాసంస్థలు, కార్యాలయాల పనివేళల్ని సవరించటానికి వీలవుతుంది. అందుకే ప్రభుత్వాలు తక్షణం కదలాలి. అవసరమైన కార్యాచరణ రూపొందించాలి. జనం ప్రాణాలు కాపాడాలి.

## ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు 239 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు

# సూరీడు సలసల



అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఎండల తీవ్రత కొనసాగింది. ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో గరిష్టంగా 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మార్కాపురం జిల్లా బొట్లగూడూరులో 45.1, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 45, నెల్లూరు జిల్లా కలిగిరిలో 44.4, పల్నాడు జిల్లా నూజెండ్లలో 44.3, చిత్తూరు జిల్లా తవణంపల్లె, నంద్యాల జిల్లా దొర్నిపాడులో 44.1, వైఎస్సార్ కడప జిల్లా కలసపాడులో 43.9, బాపట్ల జిల్లా కారంచేడులో 43.7, కర్నూలు జిల్లా మంత్రాలయంలో 43.2, అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 42.8, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తూర్పులో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. 239 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొంది. వైఎస్సార్ కడప జిల్లాలో 34 మండలాలు, నెల్లూరులో 32, తిరుపతిలో 29, పల్నాడులో 26, ప్రకాశంలో 25, మార్కాపురంలో 21, నంద్యాలలో 20, కర్నూలులో 17, చిత్తూరు జిల్లాలోని 10 మండలాల్లో ఎండ తీవ్ర ప్రభావం చూపిందని తెలిపింది. ఆదివారం గుంటూరు జిల్లా మేడికొండూరు, పెదనందిపాడు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, తుళ్లూరు, వట్టిచెరుకూరు మండలాలకు తీవ్ర వడగాలుల ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. మరోవైపు ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# బెంగాల్‌లో 'ఎగ్జిట్' డెమోక్రసీ?




బెంగాల్‌ను గెలవడానికి బీజేపీ వాళ్లు సర్వశక్తుల్నీ ధారపోశారు. రాజ్యాంగ వ్యవస్థల్ని కూడా దుర్వినియోగం చేస్తున్నారని మమతా బెనర్జీ చేస్తున్న వాదన అరణ్య రోదనగా మారిపోయింది. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో ఒక సూపర్‌వైజర్‌గా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని తప్పనిసరిగా నియమించాలని కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా ఒక తాఖీదును పంపించింది. ఈ తాఖీదు బెంగాల్‌కు మాత్రమే వర్తిస్తుందట! తృణమూల్ వర్గాలు ఇస్తున్న సమాచారం ప్రకారం ఇప్పటికే 2023లో ఇటువంటి నిబంధనను ఎన్నికల సంఘం అమల్లోకి తెచ్చింది. లెక్కింపు కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలకులుగా కేంద్ర ఉద్యోగుల్ని నియమించాలన్నది ఆ నిబంధన. ఇది దేశవ్యాప్తంగా అమల్లోనే ఉన్నది. దీనికి అదనంగా ఒక సూపర్‌వైజర్‌ను కూడా విధిగా కేంద్ర ఉద్యోగినే నియమించాలని బెంగాల్ కోసం మరో ఆదేశం జారీ అయింది. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తృణమూల్ పార్టీ హైకోర్టు మెట్లెక్కింది. అక్కడ దానికి ఓదార్పు దొరకలేదు. సుప్రీంకోర్టుకు వెళ్లింది. శనివారం నాడు సుప్రీంకోర్టు కూడా పిటీషన్‌ను డిస్మిస్ చేసింది. ఎన్నికల సంఘం విధివిధానాల్లో జోక్యం చేసుకోకూడదన్న యాంత్రిక వైఖరికి అనుగుణంగా న్యాయవ్యవస్థ స్పందించింది. అంతే తప్ప పిటీషనర్ల ఆందోళనను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించలేదని భావించాలి. ఒక నిర్దిష్ట సమయంలో అప్పటి సమాజంలోని ఆధిపత్య శక్తుల భావజాలం ప్రభావం అన్ని వ్యవస్థల మీదా అంతో ఇంతో పడుతుందేమో. అటువంటి సందర్భాల్లో ఆయా వ్యవస్థల్లో సృజనశీలత స్థానాన్ని యాంత్రికత ఆక్రమించవచ్చు. ఆరాధనా మందిరం మారితే దళితుల ఎస్సీ హోదా పోతుందని ఇటీవలే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఇదే కోణంలో అర్థం చేసుకోవలసి ఉంటుంది. జస్టిస్ కృష్ణయ్యర్, ఓ. చిన్నపరెడ్డి, హెచ్‌ఆర్ ఖన్నా, పిఎన్ భగవతి వంటి న్యాయమూర్తులు ఇప్పుడు గుర్తుకొస్తున్నారు. ఇప్పుడు ప్రణయ్‌రాయ్ వంటి జర్నలిస్టులు, యోగేంద్ర యాదవ్ వంటి సెఫాలజిస్టులు కూడా గుర్తుకొస్తున్నారు. దేశ మీడియా రంగంలో టీవీ వార్తల శకం ప్రారంభమైన తర్వాత ఆ తొలితరం అందించిన ప్రీ పోల్ సర్వేలు, ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఎంత సూపర్ హిట్ అయ్యేవో చాలామందికి గుర్తుండే ఉంటుంది. వ్యవస్థలకు లొంగని నిక్కచ్చితనం, కచ్చితత్వం నాటి సెఫాలజీని ముందుకు నడిపించాయి. మీడియా రంగాన్ని ఆధిపత్య శక్తులు తమ ఉక్కు పిడికిట్లోకి తీసుకోవడం ప్రారంభించిన తర్వాత ప్రణయ్‌రాయ్ వంటి వాళ్లు తాము స్థాపించిన సంస్థల నుంచే నిస్సహాయంగా బయటకు నడవాల్సి వచ్చిన విషాద దృశ్యాలను చూడవలసి వచ్చింది. అయినా, ప్రణయ్‌రాయ్‌లోని పాత్రికేయుడు ఓడిపోలేదు. మొన్నటి ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంలో డెబ్బయ్ ఆరేళ్ల 'ఆ యువకుడు' ఒక సాధారణ క్షేత్రస్థాయి రిపోర్టర్ మాదిరిగా సెల్‌ఫోన్ చేతిలో పట్టుకొని ప్రజలను ఇంటర్వ్యూ చేస్తున్న దృశ్యాలకు సోషల్ మీడియాలో వేలాదిమంది జేజేలు పలికారు. మీడియా రంగం విస్తరించింది. టెక్నాలజీ పెరిగింది. గతంతో పోలిస్తే ప్రజాభిప్రాయాన్ని మదింపు వేయడంలో మరింత కచ్చితత్వం ఉండే అవకాశాలు ఇప్పుడే ఎక్కువున్నాయి. కానీ ఆధిపత్య శక్తుల ఆదేశాల మేరకు మీడియా సంస్థలు రాజీపడుతున్నాయనే విమర్శలు ఎక్కువగా వినపడుతున్నాయి. ఫలితంగా ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో సక్సెస్ రేట్ కూడా తగ్గుముఖం పట్టింది. ఇప్పుడున్న సర్వే సంస్థల్లో 'యాక్సిస్ మై ఇండియా'కు సక్సెస్ రేట్ కొంచెం ఎక్కువ. ఈ సంస్థ 'ఇండియా టుడే'తో కలిసి తన సర్వే ఫలితాలను వెల్లడిస్తుందనే సంగతి తెలిసిందే. బెంగాల్ రెండో దశ పోలింగ్ పూర్తికాగానే అన్ని ఛానెళ్ళు, అన్ని సర్వే సంస్థలూ ఎగ్జిట్ పోల్ ఫలితాలను ప్రకటించాయి. ఇండియా టుడే కూడా యాక్సిస్ మై ఇండియా చేసిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను ప్రకటించింది. దేశంలో ఇంకే సర్వే సంస్థ గానీ, మీడియా సంస్థగానీ ఊహించని విధంగా తమిళనాడులో టీవీకే పార్టీ గెలిచే అవకాశముందని ప్రకటించి యాక్సిస్ మై ఇండియా సంచలనం సృష్టించింది. ఒక్క బెంగాల్ ఎగ్జిట్ పోల్‌ను మాత్రం మరుసటి రోజుకు వాయిదా వేశారు. మరుసటి రోజు కూడా ఆశాభంగమే మిగిలింది. బెంగాల్ ఎగ్జిట్ ఫలితాలను ప్రకటించబోవడం లేదని సర్వే సంస్థ ఎమ్‌డీ ప్రదీప్ గుప్తా ప్రకటించారు. ఇదొక అనూహ్యమైన పరిణామం. బెంగాల్‌పై అస్త్రసన్యాసానికి ఆయన చెప్పిన కారణం నమ్మశక్యంగా లేదు. మెజారిటీ ప్రజలు తమ అభిప్రాయాలను స్పష్టంగా చెప్పకపోవడం వల్ల ఫలితాన్ని అంచనా వేయలేకపోతున్నామని ఆయన చెప్పారు. ఇదే అసలు కారణమైతే ముందురోజే ఈ సంగతిని చెప్పి ఉండవచ్చు. తొలిదశ ఎన్నికలు అంతకు వారం రోజుల ముందే జరిగాయి. తొలిదశ జరిగిన ప్రాంతంలో ప్రజలు తమ అభిప్రాయాలను చెప్పి రెండో దశలో చెప్పకుండా ఉన్నారా? తాము క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి ప్రజలతో మాట్లాడినందువల్ల ఎవరికీ చిక్కని విధంగా తమిళనాడు నాడి తమకు చిక్కిందని చెప్పుకున్న యాక్సిస్ మై ఇండియా, కీలకమైన బెంగాల్ నాడిని ఎందుకు పట్టుకోలేకపోయిందో వివరణ ఇవ్వాల్సి ఉన్నది. ఎవరి ఒత్తిడికో లొంగి ప్రదీప్ గుప్తా బెంగాల్ ఎగ్జిట్ పోల్ ఫలితాలను ప్రకటించకుండా దాచారనే అభిప్రాయం బలపడుతున్నది. సక్సెస్ రేట్ ఎక్కువగా ఉన్న ఒక సంస్థ ఎగ్జిట్ ఫలితాలను ఆపేసినంత మాత్రాన ఆ 'బలమైన' పార్టీకి కలిగే లాభం ఏముంటుంది? ప్రజాభిప్రాయానికి భిన్నమైన ఫలితాలు కౌంటింగ్ రోజు వెలువడే అవకాశముంటుందా?.. ఉంటే, ఎలా సాధ్యం? ఒక్క బెంగాల్‌కు మాత్రమే కౌంటింగ్ సూపర్‌వైజర్లు కూడా కేంద్ర సిబ్బందే ఎందుకు కావాల్సి వచ్చిందో? ఒక్క బెంగాల్ ప్రజల నాడిని పసిగట్టడంలోనే తన అశక్తతను ఆఖరి నిమిషంలో మాత్రమే ప్రదీప్ గుప్తా ఎందుకు వ్యక్తం చేశారో? ఒక్క బెంగాల్‌లోనే 'సర్' కార్యక్రమంతో 91 లక్షల ఓట్లు ఎందుకు గల్లంతయ్యాయో? తమ పేరు తొలగింపును పునఃపరిశీలించాలని దరఖాస్తులు పెట్టుకున్న లక్షలాది మందిలో కేవలం వెయ్యిమందికి మాత్రమే ఊరట లభించడానికి కారణమేమిటో? ఎన్నికలు ముగిసిన తర్వాతనే మిగిలిన దరఖాస్తులు పరిశీలిస్తామని చెప్పడమేమిటో? ఇటువంటి పలు సందేహాలు తలెత్తడం సహజం. ఎట్టి పరిస్థితుల్లోనైనా బెంగాల్‌లో గెలిచి తీరాల్సిందేనని బీజేపీ చేస్తున్న విశ్వప్రయత్నాల్లో ఇవన్నీ భాగమని తృణమూల్ భావిస్తున్నది. బెంగాల్ గెలుపునకు బీజేపీ ఒక చారిత్రాత్మకమైన ప్రాధాన్యాన్ని ఆపాదించుకుంటున్నది. ఇటీవలనే అధికారం చేపట్టిన బిహార్‌కు తోడు బెంగాల్‌ను కూడా గెలుచుకుంటే ఆర్యావర్త కాషాయీకరణ పూర్తవుతుంది. బీజేపీ మాతృసంస్థ జనసంఘ్ వ్యవస్థాపకుడైన శ్యామాప్రసాద్ ముఖర్జీ సొంత రాష్ట్రం బెంగాల్ గెలుపుతో ఈ చారిత్రక పరిణామం పూర్తవుతుంది. ఇక మిగిలేది దక్షిణాపథమే. కొన్ని వర్తమాన కీలక పరిణామాలు చారిత్రక సందర్భాలను స్ఫురణకు తెస్తాయి. పోలికలు కనిపిస్తాయి. పద్దెనిమిదో శతాబ్దం ఉత్తరార్థంలో బెంగాల్ నవాబు సిరాజ్ ఉద్దౌలాపై బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ సేనలు ప్లాసీ యుద్ధంలో విజయం సాధించడంతో భారత్‌లో ఇంగ్లిష్ పాలనకు తొలి అడుగు పడింది. బెంగాల్‌లో గెలిస్తే ఆర్యావర్త కాషాయీకరణలో బీజేపీ తుది అడుగు పూర్తవుతుంది. బలీయమైన బెంగాల్ నవాబును ఓడించడానికి ఈస్టిండియా కంపెనీ సేనాని రాబర్ట్ క్లైవ్ మోసపూరితమైన ఎత్తుగడలు వేశాడనీ, అతని సుపీరియర్ ఆయుధ టెక్నాలజీ కూడా అందుకు తోడ్పడిందనీ చరిత్ర చెబుతున్నది. బెంగాల్‌లో గెలవడానికి బీజేపీ కూడా మోసపూరితమైన ఎత్తుగడలు వేస్తున్నదని తృణమూల్ ఆరోపిస్తున్నది. ఆరోపణల్లో ఎంతో కొంత నిజముండదని చెప్పలేము. అంతమాత్రాన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈ పదిహేనేళ్లు బెంగాల్‌ను పవిత్రంగా పరిపాలించిందని కూడా చెప్పలేము. గూండా గ్యాంగులు, అరాచక శక్తులు పాలక పార్టీ నీడలో వ్యవస్థీకృత రూపం దాల్చాయనీ, ఎన్నికల సందర్భాల్లో అవి పార్టీ తరఫున పని చేస్తున్నాయన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. అరాచక శక్తులు రాజకీయ సైన్యంగా పనిచేయడం మమతా బెనర్జీతోనే ప్రారంభం కాలేదు. నక్సల్బరీ అలజడి సద్దుమణుగుతున్న కాలంలో డెబ్బయ్యవ దశకం తొలి రోజుల్లో అప్పటి ముఖ్యమంత్రి సిద్ధార్థ శంకర్ రే హయాంలోనే ఈ రౌడీ రాజకీయ ముఠాలు ప్రారంభమయ్యాయని చెబుతారు. అన్నిరకాల వామపక్ష శక్తుల మీద, ముఖ్యంగా సీపీఎం శ్రేణుల మీద దాడులకు ఈ ముఠాలను ప్రేరేపించేవారు. సీపీఎం అగ్రనాయకుడు జ్యోతిబసు మీద కూడా ఆ రోజుల్లో హత్యాప్రయత్నం జరిగింది. ముప్పయ్ నాలుగేళ్లపాటు నిరాటంకంగా సాగిన వామపక్ష కూటమి పాలనలో కూడా రౌడీ ముఠాలను రాజకీయ అవసరాలకు వాడుకున్నారనే విమర్శ ఉన్నది. కాకపోతే, సమర్థవంతంగా భూసంస్కరణలు అమలు చేయడం, పాలనా వికేంద్రీకరణ, అవినీతి రాహిత్యం, నాయకత్వ నిరాడంబరత వంటి కారణాల వలన ఈ వ్యవహారం పెద్దగా వివాదాస్పదం కాలేదు. మమతా బెనర్జీ పాలన మళ్లీ సిద్ధార్థ శంకర్ రే వారసత్వాన్ని స్వీకరించిందనే విమర్శలున్నాయి. మమతా బెనర్జీ పాలన పట్ల ప్రజల్లో అసంతృప్తి, ప్రభుత్వ వ్యతిరేకత కూడా జనంలో ఉన్నది. కాకపోతే బెంగాల్‌ను గెలవాలనే 'చారిత్రక కర్తవ్యం' ఊపులో బీజేపీ నాయకత్వం ప్రదర్శిస్తున్న అత్యుత్సాహం, డజన్లకొద్దీ కేంద్ర మంత్రులూ, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను మోహరించడం, బెంగాల్‌పై యుద్ధం మాదిరిగా ఎన్నికల ప్రచారాన్ని మార్చడం వల్ల తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 'బెంగాలీ అస్మిత' (బెంగాల్ ఆత్మగౌరవం) ను ముందుకు తోసింది. బెంగాలీ అస్మితపై హిందూ పరిచయ్ (హిందూ భావజాలం)తో దాడి చేస్తున్నారని విస్తృతంగా ప్రచారం చేసింది. తమ భాషా సంస్కృతులకు బెంగాలీలు, తమిళులు ఎంత ప్రాధాన్యతనిస్తారో మనకు తెలిసిన విషయమే. తమ పార్టీ బెంగాలీ బెటాలియన్‌తోనే మమతపై ప్రజాస్వామ్యబద్ధంగా బీజేపీ పోరాడి ఉంటే మమత ఖాయంగా ఓడిపోయేదేమో! కానీ వ్యవస్థల మాటున నిలబడి అప్రజాస్వామిక పద్ధతులతో, మోసపూరితమైన ఎత్తుగడలతో బెంగాలీ అస్మితను ఒకవేళ గెలిస్తే, ఇకముందు దేశ భవిష్యత్తు ఎటువంటి దారిలో పయనిస్తుందోనన్నదే ప్రజాస్వామ్య శక్తుల ఆందోళన!

## వడగాల్పుల వేళ .... వాతావరణ శాఖ చల్లని కబురు



అమరావతి : భారతదేశంలో ఈ ఏడాది అసాధారణమైన వాతావరణ మార్పులు కలగనున్నాయి. సాధారణంగా మే నెల అంటే భానుడి భగభగలు, వడగాలులతో అల్లాడిపోయే ప్రజలకు ఈసారి వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. 2026 మే నెలలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని ఐఎమ్‌డి అంచనా వేసింది. ఈ వర్షపాతం దీర్ఘకాల సగటు కంటే 110 శాతానికి పైగా మించి ఉంటుందని వెల్లడించింది.1971 నుండి 2020 మధ్య నమోదైన డేటా ప్రకారం.. మే నెలలో దేశవ్యాప్త సగటు వర్షపాతం 64.1 మి.మీ. అయితే ఈ ఏడాది దేశంలోని మెజారిటీ ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఇది పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుండి ఉపశమనం కలిగించడమే కాకుండా వేసవి ఆరంభంలో వచ్చే తీవ్రమైన వడగాలుల ప్రభావాన్ని గణనీయంగా తగ్గిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వడగాలుల స్థానంలో ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది.

### కొన్ని చోట్ల వరదలు.. మరికొన్ని చోట్ల కరువు ....

దేశవ్యాప్తంగా వర్షాలు ఉన్నప్పటికీ, వాటి పంపిణీ ఏకరీతిగా ఉండదు. వాయువ్య, మధ్య భారతదేశం, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాల్లో వర్షాలు దంచి కొట్టనున్నాయి. తూర్పు, ఈశాన్య భారత్, అలాగే తూర్పు-మధ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాంతీయ అసమతుల్యత వేసవి పంటలపై, నీటిపారుదలపై ఆధారపడే వ్యవసాయంపై ప్రభావం చూపవచ్చు.

### మే 3 నుండి మే 6 వరకు అప్రమత్తం ....

ఐఎండి పలు రాష్ట్రాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లను జారీ చేసింది. మే 5 వరకు పశ్చిమ బెంగాల్, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల్లో గంటకు 40-60 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయి. భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉంది. మే 3 నుండి మే 6 మధ్య పశ్చిమ హిమాలయ ప్రాంతం, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయి. పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

### నిపుణుల హెచ్చరిక ....

వసంతకాలం ముగిసి, నైరుతి రుతుపవనాలు ప్రవేశించే ముందు ఇలాంటి తుఫాను వాతావరణం సహజమేనని, అయితే ఈసారి వర్షాల తీవ్రత, పరిమాణం గతంతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తక్కువ సమయంలో కురిసే భారీ వర్షాల వల్ల పంట నష్టం, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే అవకాశం ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, చేతికి వచ్చిన పంటలను భద్రపరుచుకోవాలని, తాజా ఐఎమ్‌డి అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు ఫాలో అవ్వాలని సూచించడమైనది.

## ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర అత్యంత కీలకం



న్యూఢిల్లీ : ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర అత్యంత కీలకమని ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేయడానికి, రాజకీయ పార్టీలు తమ బాధ్యతలను నిర్వహించేందుకు,జర్నలిస్టులు ప్రభుత్వం, ప్రతిపక్షాలు రెండింటినీ నిష్పక్షపాతంగా జవాబుదారీగా ఉంచాలని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన ఎక్స్ లో ఈ విధంగా పేర్కొన్నారు. "ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా తొటి జర్నలిస్టులకు శుభాకాంక్షలు. ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర అత్యంత కీలకమైనది. ప్రభుత్వం, ప్రతిపక్షాలు రెండూ తమ మార్గం నుండి వైదొలగకుండా ఉండేందుకు, పూర్తి నిష్పక్షపాతంగా ప్రభుత్వం, ప్రతిపక్షాలు రెండింటినీ ప్రశ్నించడం పత్రికల బాధ్యత" అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు ఎటువంటి భయం, ఒత్తిడి లేకుండా వాస్తవాలను మాట్లాడే స్వేచ్ఛను కలిగి ఉండాలని పునరుద్ఘాటించారు. స్వేచ్ఛాయుత పత్రిక ప్రజాస్వామ్యానికి గొంతుక అని, కానీ దేశంలో మీడియాపై తీవ్రమై దాడి జరుగుతోందని కాంగ్రెస్ పేర్కొంది. వాస్తవాలను తెలియజేసే, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడానికి కృషి చేసే పాత్రికేయులకు సంఘీభావం ప్రకటిస్తున్నట్లు ఎక్స్ లో పేర్కొంది. 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీ-2026-లో భారత్ 157వ స్థానానికి పడిపోయిన సంగతి తెలిసిందే. గతేడాది 151గా వున్న భారత్ ర్యాంక్ ఇప్పుడు ఏకంగా ఆరు స్థానాలు దిగజారడం ఆందోళనకరం.పొరుగుదేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ లు భారత్ కంటే మెరుగ్గా వుండటం గమనార్హం. ప్రపంచంలోనే అత్యుత్తమ పత్రికా స్వేచ్ఛ వున్న దేశాల్లో గత పదేళ్లుగా నార్వే మొదటి స్థానంలోనే వుంది.

## 'కట్టుకథలతో నాపై అట్రాసిటీ కేసు పెట్టారు'



పల్నాడు జిల్లా: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తనపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారని.. హైకోర్టు ఆదేశాలతో చిలకలూరిపేట పోలీస్ స్టేషన్ వచ్చానని మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యులు, కార్యకర్తల మీద అక్రమ కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో హత్యలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయని.. 70కి పైగా జర్నలిస్ట్‌లపై కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. "మాజీ ఎమ్మెల్యేలు ఎంపీలు, ఐఏఎస్‌లను కూడా రెడ్‌బుక్ వదల్లేదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైనే పోలీసులు దృష్టి పెట్టారు. అందుకే పోలీస్ శాఖ ర్యాంక్ పడిపోయింది. కూటమి ప్రభుత్వం ఫెయిల్ అయింది. విద్యుత్ ఛార్జీలు తగ్గించామంటూ నిరసన ర్యాలీ చేస్తే నాపై కేసు పెట్టారు. కట్టుకథలు అల్లీ మాపై అక్రమ కేసులు పెడుతున్నారు. గుడికి వెళ్లి వస్తుంటే నా మీద దాడి చేసి.. కేసు కట్టారు. ..ప్రతిపక్ష గొంతు వినపడకూడదని కుట్రపన్ని అక్రమ కేసులు పెడుతున్నారు. మీ అక్రమ కేసులకు మేం భయపడం. మీరు హామీలను నెరవెర్చకుంటే ఆందోళన చేస్తాం. నేను ఎందుకు భయపడాలి?. మీరు నాటిన విష విత్తనం వృక్షమైతే ఎలాంటి పరిస్థితులుంటాయో ఆలోచించుకోండి" అంటూ విడదల రజిని వ్యాఖ్యానించారు.

## తెలుగురాష్ట్రాలపై భానుడి పంజా..!

తెలుగు రాష్ట్రాల్లో భానుడు దగదగలు మండిపోతున్నాయి. రెండురాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడపలో అత్యధికంగా 42.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా రెంటచింతల, కర్నూలు, చిత్తూరులో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు హైదరాబాద్, నల్లగొండ, నిజామాబాద్, కరీంనగర్‌లలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఎండలు మండిపోతుండడంతో ప్రజలెవ్వరూ ఏదైనా అత్యవరమైతే తప్ప ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ బయిటకి రాకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ బయిటకి వెళ్లినా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.


# ఇక సొంతంగా ఆర్టీసీకి ఎలక్ట్రిక్ బస్సులు

**కనీసం 2 వేల బస్సులు సమకూర్చుకునే దిశగా ప్రభుత్వం కసరత్తు**

**ప్రస్తుతం పీఎం ఈ--డ్రైవ్ పథకం కింద అద్దె ప్రాతిపదికన 2,300 బస్సులకు ఆర్డర్**

**జనాభా దామాషా ప్రకారం సిటీలో కనీసం 5 వేల బస్సులుండాలని నిర్ణయం**

**ఆ మేరకు మిగతా బస్సులను సొంతంగా కొనే యోచనలో ప్రభుత్వం**



హైదరాబాద్: ప్రస్తుతం అద్దె ప్రాతిపదికన ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చుకుంటున్న ఆర్టీసీ, ఇక సొంతంగా కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం నగరంలో 3 వేల లోపు సంఖ్యలో మాత్రమే ఆర్టీసీ బస్సులున్నాయి. ఇవి అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం సరిపోవు. నగర జనాభా ప్రకారం దాదాపు 6 వేల బస్సులు అవసరం. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న బస్సుల సంఖ్యను కనీసం 5 వేలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం పీఎం ఈ--డ్రైవ్ కింద కేంద్ర ప్రభుత్వం నగరానికి 2,300 బస్సులు మంజూరు చేసింది. ప్రస్తుతమున్న ఎలక్ట్రిక్ బస్సులతో కలుపుకొంటే మొత్తం ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య 3 వేలకు చేరుకుంటుంది. దీంతో మరో 2 వేల బస్సులను సొంతంగా సమకూర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### 2030 నాటికి అందుబాటులోకి కొన్ని సొంత బస్సులు

విజన్ 2047 కోసం ఆర్టీసీ కూడా ఓ ప్రణాళికను సిద్ధం చేసుకుంది. ఇందులో 2027 నాటికి గ్రేటర్ నగరం (ఔటర్ రింగురోడ్డు లోపల)లో ఆర్టీసీకి డీజిల్ బస్సులు ఉండకూడదన్నది లక్ష్యం. అంటే వచ్చే ఏడాది నాటికి నగరంలో అన్నీ ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులు మాత్రమే ఉంటాయి. పీఎం ఈ--డ్రైవ్ కింద వచ్చే ఏడాది చివరి నాటికి అన్ని బస్సులు అందుతాయి. దీంతో అప్పటికి డీజిల్ బస్సులన్నింటిని ఔటర్ వెలుపలి డిపోలకు బదిలీ చేస్తారు. ఇక 2030 నాటికి జనాభా దామాషా ప్రకారం బస్సులను సమకూర్చుకోవాలన్నది రెండో లక్ష్యం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పథకం కింద గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో బస్సులను సమకూర్చుకుంటుండగా, అవి జనాభా దామాషా పద్ధతిలో కావాల్సిన సంఖ్యలో ఉండవు. దీంతో అదనంగా 2 వేల బస్సులను సొంతంగా సమకూర్చుకోవాలన్నది ఆ లక్ష్యంలో భాగం. వేయి వరకు మినీ బస్సులు: ప్రస్తుతం ఎలక్ట్రిక్ బస్సులన్నీ 9 మీటర్ల కంటే పొడవైన పెద్ద బస్సులు. ఇంత పరిమాణంలో బస్సులు నగరంలోని అన్ని ప్రాంతాలకు తిరగలేవు. పాత నగరంలోని రోడ్లపై మరీ కష్టం. దీంతో ఆయా ప్రాంతాల్లో తిరిగే విధంగా మినీ ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చుకోవాలని నిర్ణయించింది. దీనికి తోడు, ఆర్టీసీ బస్సులను మెట్రో రైలు సర్వీసులతో అనుసంధానించబోతున్నారు. మెట్రో రెండు దశ కూడా రాబోతున్నందున ఫస్ట్ మైల్--లాస్ట్ మైల్ కనెక్టివిటీ ఫార్ములాను అమలులోకి తేవాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. కాలనీలను మెట్రో స్టేషన్లతో అనుసంధానించాలి. అంటే కాలనీల్లో బస్సెక్కి మెట్రో స్టేషన్ వరకు వెళ్లేలా, మెట్రో రైలు దిగి బస్సెక్కి కాలనీల వరకు చేరేలా ఈ అనుసంధానం ఉంటుంది. మినీ బస్సులను ఇందుకు కూడా వాడాలన్నది ప్లాన్. వెరసి ఈ రెండు అవసరాలకు వేయి వరకు మినీ బస్సులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

### మెట్రో రైలు ప్రాజెక్టు లోన్‌తో అనుసంధానం

ఎలక్ట్రిక్ బస్సులు ఖరీదైనవి కావటంతో ఇంతకాలం ఆర్టీసీ సొంతంగా కొనటం కంటే అద్దె ప్రాతిపదికన సమకూర్చుకోవటం మెరుగైన విధానంగా భావిస్తోంది. భవిష్యత్‌లో మన దేశంలోనే ఎలక్ట్రిక్ బస్సు బ్యాటరీలు తయారు కాబోతున్నందున ఎలక్ట్రిక్ బస్సుల ధరలు కూడా తగ్గనున్నాయి. దీనికి తోడు, మెట్రో రైలు విస్తరణకు ప్రభుత్వం భారీగా రుణాలు పొందబోతోంది. మెట్రో రైలు ప్రాజెక్టులో ఆర్టీసీ బస్సులకు కూడా భాగస్వామ్యం ఉండనున్నందున, మెట్రో ప్రాజెక్టు కోసం తీసుకునే రుణంలో కొంత మొత్తాన్ని ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు కూడా వాడనున్నారు.

ఉద్యోగాలకు భరోసా...

ప్రస్తుతం జీసీసీ పద్ధతిలో నగరంలో ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకుంటున్నందున, డ్రైవర్లు, మెకానిక్ సిబ్బంది ప్రైవేటు సంస్థలే సమకూరుస్తాయి. కేవలం కండక్టర్లు మాత్రమే ఆర్టీసీ వైపు నుంచి ఉంటారు. ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్ సిబ్బందిని నగరం వెలుపలికి బదిలీ చేయనున్నారు. కొంతమందిని ఇతర అవసరాలకు వాడుకోనున్నారు. దీనిపై ఆర్టీసీ కారి?మకుల నుంచి తీవ్ర నిరసన ఎదురవుతోంది. భవిష్యత్‌లో ఆర్టీసీ సొంతంగా ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకుంటున్నందున, వెలుపలికి వెళ్లే సిబ్బంది తిరిగి నగరానికి వస్తారన్న భరోసాను ప్రభుత్వం కల్పించే ప్రయత్నం చేస్తోంది.

# ఆర్ఆర్టీఎస్.. మెట్రో రైలా?

హైదరాబాద్: ర్యాపిడ్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్టీఎస్).. మెట్రో రెండో దశకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో అనూహ్యంగా తెరపైకి వచ్చింది. తక్కువ నిర్మాణ వ్యయంతో వేగవంతమైన రవాణా సదుపాయాన్ని అందజేసే ఆర్ఆర్టీఎస్ ప్రాజెక్టును హైదరాబాద్‌లో చేపట్టాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం నగరంలో నడుస్తున్న మెట్రో కంటే ఆర్ఆర్టీఎస్ ఎక్కువ వేగంతో పరుగులు తీస్తోంది. ప్రయాణికులకు హైస్పీడ్ రైల్ అనుభూతిని అందజేస్తుందని కేంద్ర పట్టణాభివృద్ధిమంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. మెట్రో రెండోదశ నిర్మాణంలో భాగంగానే ప్రభుత్వం మొదటి దశ ప్రాజెక్టును ఎల్అండ్‌టీ నుంచి కొనుగోలు చేసింది. కానీ.. ప్రస్తుత మెట్రో కంటే ఢిల్లీ నుంచి మీరట్‌కు కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఆర్ఆర్టీఎస్ తరహాలో హైదరాబాద్‌లో నిర్మించాలని పేర్కొనడం గమనార్హం. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రం అనుమతి కోసం పంపించిన రెండో దశ డీపీఆర్‌లకు అనుమతి లభిస్తుందా లేక, ఆర్ఆర్టీఎస్‌కే కేంద్రం కట్టుబడి ఉంటుందా అనేది చర్చనీయాంశంగా మారింది.




### మెట్రో రెండో దశకు భారీ వ్యయం..

రెండో దశలో మొత్తం 8 కారిడార్‌లలో మెట్రో విస్తరణకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. నాగోల్ నుంచి ఎయిర్‌పోర్ట్,(36,8 కి.మీ.) రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపోలిస్ (11.6 కి.మీ, ) ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్--పటాన్‌చెరు (13.4 కి.మీ.),ఎల్‌బీనగర్--హయత్‌నగర్ (7.1 కి.మీ.) చొప్పున మొత్తం 76.4 కి.మీ వరకు.. ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్‌సిటీ (39.6 కి.మీ.), జేబీఎస్--మేడ్చల్ (22 కి.మీ.), జేబీఎస్-- శామీర్‌పేట్ (22కి.మీ,) కారిడార్‌లలో మరో 86.1 కి.మీ మెట్రో నిర్మాణం చేపట్టాలనేది ప్రతిపాదన.

### ప్రాజెక్టు వ్యయం మొత్తం రూ.48 వేల కోట్లు..

ఈ మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.48 వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా. మొదటి దశ కొనుగోలు కోసం వెచి?ంచే సుమారు రూ.15000 కోట్ల వ్యయంతో కలిపి రూ.63000 కోట్లకు చేరనుంది. మెట్రో రెండో దశకు అవసరమైన నిధులను జైకా,ఏడీబీ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి కేవలం 2 శాతం వడ్డీకి నిధులను సేకరించాలనేది ప్రభుత్వ ప్రణాళిక. ఈ మేరకు ఇప్పటికే ప్రాథమికంగా జైకాతో ఒప్పందం కూడా ఏర్పడింది. కేవలం రూ.48000 కోట్లతో 192.2 కి.మీ వరకు ఆర్ఆర్టీఎస్ ప్రాజెక్టును చేపట్టవచ్చని కేంద్రం ప్రతిపాదిస్తోంది.

### నిర్మాణ వ్యయం తగ్గుతుందని..

పటాన్‌చెరు--లక్డీకాపూల్-- ఆరాంఘర్, రాయదుర్గం--కోకాపేట్, ఎల్‌బీనగర్-- హయత్‌నగర్, ఎంజీబీఎస్--చాంద్రాయణగుట్ట, ఎయిర్‌పోర్ట్--ఫ్యూచర్‌సిటీ, జేబీఎస్--మేడ్చల్, జేబీఎస్-- శామీర్‌పేట్ రూట్లలో ఆర్ఆర్టీఎస్ చేపట్టాలని మెట్రోరైల్ సంస్థకు కేంద్రం ప్రతిపాదనలు చేసింది. కానీ.. ప్రతిపాదిత ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ల వల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉంటుందని హెచ్ఎంఆర్ఎల్ పేర్కొంది. అయితే.. భూగర్భ కారిడార్‌లను నిర్మించి వ్యయాన్ని తగ్గించుకోవచ్చని కేంద్రం సూచించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనలకు భిన్నంగా మెట్రో నిర్మాణ దిశగానే రాష్ట్రం ముందుకువెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.


### వేగం ఎక్కువే..

ప్రస్తుతం మెట్రో రైళ్లు గంటకు గరిష్ఠంగా 80 కి.మీ వేగంతో నడుస్తున్నాయి. ఆర్ఆర్టీఎస్ రైళ్లు గరిష్ఠంగా 160 కి.మీ వేగంతో పరుగులు తీస్తాయి. ఈ రైళ్లు యూరోపియన్ ట్రైన్ కంట్రోల్ సిస్టమ్ (ఈటీఎస్‌సీ) సిగ్నలింగ్ వ్యవస్థతో నడుస్తాయి. ఇది మెట్రో రైళ్లలో వినియోగించే సిగ్నలింగ్ వ్యవస్థ కంటే అత్యాధునికమైనది. ఢిల్లీ నుంచి మీరట్ వరకు 82.15 కి.మీ మార్గంలో ఆర్ఆర్టీఎస్ నడుస్తోంది.'నమో భారత్' పేరుతో ఈ రైళ్లను నడుపుతున్నారు.

# సముద్రంలో సమున్నతంగా..

**తీరంలో సముద్రజలాల అడుగున అతిపెద్ద త్రివర్ణపతాకం ఆవిష్కరణ**

**కొత్త గిన్నిస్ ప్రపంచ రికార్డ్ నమోదు**



శ్రీ విజయపురం: త్రివర్ణపతాకంపై అభిమానం ఎంతటి అనితర సాధ్యమైన కార్యాన్నయినా సుసాధ్యంచేయిస్తుంది. భారత జాతీయజెండా గురించి యావత్ ప్రపంచం మరోసారి చర్చించుకునేలా చేశారు పలువురు సాహసికులు. పోలీసులు, సైన్యం, నావికాదళం, తీరగస్తీదళం, గజ ఈతగాళ్లుసహా పలువురి సమష్టి కృషి ఏకంగా నూతన గిన్నిస్ ప్రపంచరికార్డ్‌ను బద్దలుకొట్టేలాచేసింది. ఇందుకు అండమాన్‌నికోబార్ దీవుల్లోని రాధానగర్ బీచ్ వేదికైంది. సముద్రజలాల్లో అడుగున అతిపెద్ద జాతీయజెండాను ఆవిష్కరించి పలువురు కొత్త గిన్నిస్ రికార్డ్‌ను నెలకొల్పడం విశేషం. అండమాన్‌నికోబార్ పరిధిలోని స్వరాజ్ ద్వీప్(హ్యావ్‌లాక్ ఐలాండ్)లోని రాధానగర్ బీచ్‌లోకి 60 మీటర్ల పొడవు, 40 మీటర్ల వెడల్పున్న త్రివర్ణపతాకాన్ని తీసుకొచ్చారు. తర్వాత అండమాన్‌నికోబార్ పోలీస్, అటవీ శాఖ, భారత నేవీ, తీర గస్తీ దళంతోపాటు పలు డైవింగ్ సెంటర్లకు చెందిన గజ ఈతగాళ్లు జాతీయజెండాను సముద్రజలాల్లోకి మోసుకెళ్లారు. తర్వాత నీటిలోకి తీసుకెళ్లి అడుగున పూర్తిగా పరిచారు. డ్రోన్ల నుంచి చూస్తే సముద్రంలో త్రివర్ణపతాకం నీలిఅలలకు రెపరెపలాడుతూ కన్పించి కనువిందుచేసింది. 200 మందికిపైగా డైవర్లు ఈ రికార్డ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరిలో పాఠశాల విద్యార్థులు ఫతే జహాన్ సింగ్(16), లావణ్య ఇరా(15), రణ్‌విజయ్ సింగ్(14) సైతం పాల్గొనడం విశేషం. ఉదయం 10.35 గంటలకు రికార్డ్ నమోదైనట్లు గిన్నిస్ ప్రపంచ రికార్డ్స్ ప్రతినిధి రిషి నాథ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అండమాన్‌నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ డీకే జోషి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చంద్రభూషణ్ కుమార్, డీజీపీ హెచ్ఎస్ ధలివాల, సీనియర్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. "భారీ అలల తాకిడిని సైతం తట్టుకుంటూ అంతటి బరువైన జెండాను నడుస్తూ లోపలిదాకా మోసుకుంటూ వెళ్లి ఆక్సిజన్ సిలిండర్ల సాయంతో ఊపిరితీసుకుంటూ జెండా ఆవిష్కరణ జేసి రికార్డ్‌ను నెలకొల్పడం నిజంగా అద్భుతం" అని గవర్నర్ జోషి అభినందించారు. ఇక్కడ పర్యాటకం, సముద్ర కార్యకలాపాలకు ఊపందుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. సముద్రజలాల లోపల త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించడం మాటలకందని మధురానుభూతి అని ఢిల్లీలోని సర్దార్‌పటేల్ విద్యాలయలో పదో తరగతి చదువుతున్న రణ్‌విజయ్ సింగ్ చెప్పాడు. ఉట్టి కొట్టేటప్పుడు నిలబడినట్లుగా.. ఆదివారం సముద్రం అడుగు నుంచి ఒకరిపై మరొకరు నిల్చుని అతిపెద్ద మానవ నిచ్చెనగా ఏర్పడి మరో గిన్నిస్ రికార్డ్‌నెలకొల్పాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. స్వరాజ్ ద?వప్‌లోని లైట్‌హౌస్ డైవ్ సైట్‌లో ఈ రికార్డ్‌కు డైవర్లు సిద్ధమవుతున్నారు.

# ప్రభాస్ తర్వాత ఈ హీరో ఒక్కడికే ఆ ఛాన్స్!

**భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ప్రస్తుతం పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ తర్వాత ఆ స్థాయి భారీ ప్రాజెక్టులతో.. పక్కా ప్రణాళికతో దూసుకుపోతున్న ఏకైక హీరోగా రణబీర్ కపూర్ నిలుస్తున్నారు.**



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ప్రస్తుతం పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ తర్వాత ఆ స్థాయి భారీ ప్రాజెక్టులతో.. పక్కా ప్రణాళికతో దూసుకుపోతున్న ఏకైక హీరోగా రణబీర్ కపూర్ నిలుస్తున్నారు. రణబీర్ ప్రస్తుతం నటిస్తున్న ఐదు చిత్రాలను పరిశీలిస్తే..ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా అత్యంత వైవిధ్యమైన కంటెంట్ తో రూపొందుతున్నాయి. నటుడిగా తనలోని భిన్న కోణాలను ఆవిష్కరించుకునేందుకు అతడు సిద్ధమవుతున్న తీరు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఆదిత్య ధర్ దర్శకత్వంలో వస్తున్న -లవ్ అండ్ వార్- చిత్రంలో రణబీర్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారనే వార్త సినిమాపై అంచనాలను పెంచేసింది. ఒంటరితనంలోని సుఖం: టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ల డైలమా మరోవైపు నితీష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న -రామాయణం- చిత్రం ఇందుకు పూర్తి భిన్నమైనది. ఇందులో రణబీర్ పరమ పవిత్రమైన, ఆదర్శవంతమైన శ్రీరాముడి పాత్రలో నటిస్తున్నారు. ఈ ఏడాది దీపావళికి రామాయణం మొదటి భాగం.. వచ్చే ఏడాది దీపావళికి రెండో భాగం విడుదల కానున్నాయి. విశేషం ఏమిటంటే.. ఈ రెండు ఆధ్యాత్మిక చిత్రాల మధ్యలో జనవరి చివరి వారంలో నెగెటివ్ షేడ్ ఉన్న -లవ్ అండ్ వార్- విడుదల కానుంది. ఒకే సమయంలో ఆదర్శప్రాయమైన దైవ సమానమైన పాత్రలోనూ... రాక్షస ప్రవృత్తి ఉన్న పాత్రలోనూ కనిపించడం రణబీర్ తీసుకున్న అతిపెద్ద సవాలుగా భావించవచ్చు. ాశ్రీంశీ =ఋు - బాలీ రిసార్టులో -రాజా సాబ్- బ్యూటీ.. మన బీచ్‌లేవీ నచ్చవెందుకు? కేవలం ఇవే కాకుండా.. రణబీర్ తదుపరి చిత్రాల ఎంపిక కూడా ఉత్కంఠను కలిగిస్తోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న -యానిమల్ పార్క్- (యానిమల్ సీక్వెల్) 2028లో విడుదల కానుంది. ఇది ఒక పక్కా సోషల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను రక్తి కట్టించనుంది. ఆ తర్వాత సోషియో-ఫాంటసీ జోనర్‌లో -బ్రహ్మాస్త్ర పార్ట్ 2స- రాబోతోంది. ఇలా వరుసగా ఐదు చిత్రాల్లో ఐదు విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రలను పోషిస్తూ.. రణబీర్ తన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఒకే తరం ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందించడమే అతడి లక్ష్యంగా కనిపిస్తోంది.- వయసుకు, క్రేజ్‌కు మించి సినిమాలు చేస్తున్నాడా అయితే ఒక పాత్రలో శ్రీరాముడిగా చూసిన ప్రేక్షకులే.. మరో సినిమాలో మరో పాత్రలో నెగెటివ్ షేడ్స్‌లో చూడగలరా అనే సందేహాలు కొందరిలో వ్యక్తమవుతున్నాయి. పరిణతి చెందని ఒక సెక్షన్ రాముడిగా చూసిన తర్వాత అతడిని రాక్షసుడిగా చూడలేమని వాదిస్తున్నా.. మెజారిటీ సినీ విశ్లేషకులు మాత్రం నటుడు ఎల్లపుడూ అన్ని రకాల పాత్రల్లోనూ మెప్పించాలని అభిప్రాయపడుతున్నారు. పాత్రకు, నటుడికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అర్థం చేసుకునే స్థాయికి నేటి ప్రేక్షకులు చేరుకున్నారని విశ్లేషిస్తున్నారు. రణబీర్ ప్రతి ఎంపికా అతడిలోని నటనా వైవిధ్యాన్ని నిరూపించడానికి ఒక గొప్ప వేదిక - స్టన్నింగ్ లుక్‌లో మెరిసిన నోరా ఫతేహి ఈ క్రమంలో రణబీర్ కపూర్ భారతీయ దిగ్గజ నటుల బాటలో నడుస్తున్నారని చెప్పవచ్చు. గతంలో నవరస నటసార్వభౌముడు ఎన్టీఆర్ వంటి వారు ఒకే సినిమాలో హీరోగానూ, విలన్‌గానూ నటించి మెప్పించారు. ఒకే చిత్రంలో నాలుగైదు పాత్రల్లో నటించిన ఘనత లెజెండరీ ఎన్టీఆర్ కి ఉంది. జానపద, పౌరాణిక చిత్రాల్లో రాముడిగా అలరించి, అదే సమయంలో రావణుడిగా, దుర్యోధనుడిగాను అదరగొట్టిన ఘనత అన్నగారిది. నేటితరం హీరోలు కూడా అదే స్ఫూర్తితో అన్ని రకాల పాత్రలను పోషించి బాక్సాఫీస్ వద్ద తమ సత్తా చాటాల్సి ఉంటుంది. రణబీర్ కపూర్ ఎంచుకున్న ఈ మార్గం అతడిని భారతీయ చిత్ర పరిశ్రమలో బిగ్గెస్ట్ కాంపిటీటర్‌గా నిలబెడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# శర్వా - శ్రీను వైట్ల సినిమా పరిస్థితేంటీ





వరుస ఫ్లాపులతో సతమతమైన శర్వానంద్ ఈ ఏడాది ప్రారంభంలో సంక్రాంతి బరిలో నిలిచి -నారీ నారీ నడుమ మురారి- మూవీతో సూపర్ హిట్‌ని తన ఖాతాలో వేసుకున్న విషయం తెలిసిందే. వరుస ఫ్లాపులతో సతమతమైన శర్వానంద్ ఈ ఏడాది ప్రారంభంలో సంక్రాంతి బరిలో నిలిచి

మూవీతో సూపర్ హిట్‌ని తన ఖాతాలో వేసుకున్న విషయం తెలిసిందే. రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా సంక్రాంతి బరిలో నలిచి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. పోటీలో పెద్ద సినిమాతో పాటు చిన్న సినిమాలు కూడా ఉన్నా వాటన్నింటినీ ఓవర్ టేక్ చేసి సూపర్ హిట్ అనిపించుకుంది. దీంతో శర్వా మళ్లీ ట్రాక్‌లోకి వచ్చేశాడు. మాంచి జోష్ మీదున్నాడు


-నారీ నారీ నడుమ మురారీ- సక్సెస్ తరువాత శర్వానంద్ నుంచి వచ్చిన మూవీ -బైకర్-. డా. రాజశేఖర్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై మంచి టాక్‌తో సూపర్ హిట్ అనిపించుకుంది. వసూళ్ల పరంగానూ మంచి ఫిగర్లని దాటిన ఈ మూవీపై ప్రముఖులు ప్రశంసలు కురిపించారు. కింగ్ నాగార్జున నుంచి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరకు సినిమాని, ఇందులో నటించిన నటీనటులని ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం ఈ మూవీ థియేటర్లలో విజయవంతంగా రన్నవుతోంది.

మన బీచ్‌లేవీ నచ్చవెందుకు? ఇదిలా ఉంటే ఈ మూవీ తరువాత శర్వానంద్ డైరెక్టర్ శ్రీను వైట్లతో ఓ భారీ మూవీకి శ్రీకారం చుదుతున్నాడంటూ వార్తలు షికారు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ వారు అత్యంత భారీ బడ్జెట్‌తో తెరపైకి తీసుకురాబోతున్నారు. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ చాలా రోజులుగా జరుగుతోంది. గత కొంత కాలంగా తన క్రేజ్‌ని కోల్పోయిన శ్రీను వైట్ల ..శర్వా సినిమాతో మళ్లీ ట్రాక్‌లోకి రావాలనే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇందులో భాగంగానే శర్వాతో ట్రావెల్ అవుతున్నారు.

శ్రీను వైట్ల శైలి కామెడీతో సాగే యాక్షన్ ఎంటర్ టైనర్‌గా దీన్ని తెరపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ని స్టార్ట్ చేసి 2027 సంక్రాంతికి సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేశారు. కానీ అది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దానికి ప్రధాన కారణం ఈ మూవీ అనుకున్న టైమ్‌కి పట్టాలెక్కేలా కనిపించకపోవడమే. కారణం బడ్జెట్. ముందు అనుకున్న బడ్జెట్‌కు మించి అవుతుండటంతో మేకర్స్ వెనుకడుగు వేస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ సినిమా మేకర్స్ నుంచి చేతులు మారే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. వరుస ఫ్లపులతో ఫామ్‌ని కోల్పోయిన శ్రీను వైట్లతో భారీ బడ్జెట్ సినిమా చేయడం ప్రమాదమని మేకర్స్ భయపడుతున్నారట. ఆ కారణంగానే వెనకడుగు వేస్తున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఈ మూవీకి -జార్జ్ కృష్ణ- అనే టైటిల్ వినిపిస్తోంది.

# ఆయిషా శర్మ గ్లామర్ డోస్.. కుర్రాళ్లకు ఫుల్ ట్రీట్!





బాలీవుడ్ భామ నేహా శర్మ సోదరిగా పరిచయమైన ఆయిషా శర్మ, ఇప్పుడు తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. కేవలం మ్యూజిక్ వీడియోలకే పరిమితం కాకుండా, సోషల్ మీడియాలో తన గ్లామర్ పవర్ చూపిస్తూ ఫాలోయింగ్‌ను విపరీతంగా పెంచుకుంటోంది. తాజాగా వెకేషన్‌లో ఆమె దిగిన హాట్ ఫోటోలు నెట్టింట సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. వేసవి తాపాన్ని మరింత పెంచేలా ఆయిషా చేసిన ఈ గ్లామర్ షో ఇప్పుడు కుర్రాళ్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఒంటరితనంలోని సుఖం: టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ల డైలమా వెకేషన్ ఫోటోలతో సెగలు పుట్టిస్తోంది: ఆయిషా శర్మ సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉంటుందో మనందరికీ తెలిసిందే. తాజాగా ఆమె తన వెకేషన్ నుంచి కొన్ని ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఈ ఫోటోల్లో ఆయిషా మోనోకినీ ధరించి తన అందాలను ఆరబోస్తూ కనిపించింది. సముద్రపు ఒడ్డున ప్రకృతిని ఆస్వాదిస్తూనే, తన హాట్ లుక్స్‌తో ఇంటర్నెట్‌లో సెగలు పుట్టిస్తోంది. ఈ వేసవి కాలంలో ఆమె షేర్ చేసిన ఈ ఫోటోలు చూస్తుంటే కుర్రాళ్లకు చెమటలు పట్టడం ఖాయం అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.


మన బీచ్‌లేవీ నచ్చవెందుకు? సోషల్ మీడియాలో పెరిగిన క్రేజ్: కెరీర్ ప్రారంభంలో నేహా శర్మ సోదరిగానే అందరికీ తెలిసినా, ఇప్పుడు ఆయిషా తనకంటూ ఒక సొంత ఫ్యాన్ బేస్‌ను క్రియేట్ చేసుకుంది. సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నిస్తూనే, నిత్యం ఫిట్‌నెస్ మరియు గ్లామర్ ఫోటోషూట్‌లతో వార్తల్లో నిలుస్తోంది. ఆయిషాకు ఫిట్‌నెస్ అంటే చాలా ప్రాణం, అందుకే ఆమె బాడీ ఎప్పుడూ పర్‌ఫెక్ట్ షేప్‌లో ఉంటుంది. ఆ పర్‌ఫెక్ట్ ఫిగర్‌తో ఆమె చేసే గ్లామర్ అటాక్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

మ్యూజిక్ వీడియోల నుంచి సినిమాల వరకు: ఆయిషా శర్మ కేవలం ఫోటోలకే పరిమితం కాకుండా పలు మ్యూజిక్ వీడియోల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలాగే కొన్ని బాలీవుడ్ చిత్రాల్లో కూడా మెరిసింది. సినిమాల పరంగా బిజీగా ఉంటూనే, తన ఫాలోవర్లను అలరించడంలో ఎప్పుడూ ముందుంటుంది. ఇక ఆయిషా స్టైల్ మరియు ఆమె డ్రెస్సింగ్ సెన్స్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. అందుకే ఆమె ఏ ఫోటో పెట్టినా అది క్షణాల్లో వైరల్ అయిపోతుంది. తాజాగా షేర్ చేసిన మోనోకినీ ఫోటోలు కూడా అదే రేంజ్‌లో దూసుకుపోతున్నాయి

ఫ్యాన్స్ కు ఫుల్ విందు: ఆయిషా శర్మ షేర్ చేసిన ఈ లేటెస్ట్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. గ్లామర్ డోస్ పెంచి కుర్రాళ్లకు ఫుల్ ట్రీట్ ఇచ్చిందని చెప్పవచ్చు. భవిష్యత్తులో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులతో ఆమె వెండితెరపై మెరవాలని అభిమానులు కోరుకుంటున్నారు. గ్లామర్ మరియు టాలెంట్ ఉన్న ఈ బ్యూటీకి ఏదైనా పెద్ద హిట్ తగిలితే స్టార్ హీరోయిన్ అవ్వడం ఖాయం. అప్పటి వరకు ఆయిషా ఇచ్చే ఈ గ్లామర్ ట్రీట్‌ను ఎంజాయ్ చేయాల్సిందే.

# విష్ణుప్రియకు ఇప్పుడు నెలకు రూ.23 లక్షలా

**డిజిటల్ మీడియా కాలంలో ఏది ఎప్పుడు వైరల్ అవుతుందో అంచనా వేయడం కష్టం**



డిజిటల్ మీడియా కాలంలో ఏది ఎప్పుడు వైరల్ అవుతుందో అంచనా వేయడం కష్టం. కొన్ని సందర్భాల్లో విమర్శలే వ్యక్తిగత ప్రచారానికి హెల్ప్ చేస్తుంటాయి. ప్రస్తుతం బుల్లితెర నటి, బిగ్ బాస్ ఫేమ్ విష్ణుప్రియ భీమినేని విషయంలో ఇదే చర్చ నడుస్తోంది. ఆమెపై నమోదైన కేసు ఒకవైపు వివాదానికి దారి తీస్తే, మరోవైపు ఆర్థికంగా మాత్రం లాభాలను తెచ్చిపెట్టిందన్న ప్రచారం హాట్ టాపిక్ గా మారింది. విష్ణుప్రియ తన ఇన్ స్టాగ్రామ్ లో ప్రత్యేక కంటెంట్ కోసం సబ్ స్క్రిప్షన్ విధానం అమలు చేస్తున్నారు. ఒక్కో యూజర్ నుంచి రూ.399 వసూలు చేస్తోంది. అయితే, విజయవాడలో ాూఖీ నాయకులు అశ్లీల కంటెంట్ ప్రోత్సహిస్తున్నారంటూ ఫిర్యాదు చేయకముందు వరకు ఆమె సబ్ స్క్రైబర్ల సంఖ్య పరిమితంగా ఉందని సమాచారం. కేసు నమోదు ముందు సుమారు 1,892 మంది మాత్రమే సబ్‌స్క్రైబర్లు ఉండగా, ఈ లెక్కన ఆమెకు నెలకు సుమారు రూ.7.5 లక్షల ఆదాయం వచ్చినట్లు అంచనా.

టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్. బ్యాచిలర్ల డైలమా కేసు నమోదు తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారింది. మీడియా, సోషల్ మీడియాలో ఆ వివాదం పెద్ద ఎత్తున చర్చకు దారితీయడంతో ఆసక్తి పెరిగింది. దీంతో ఆమె సబ్‌స్క్రైబర్ల సంఖ్య వేగంగా పెరిగి 6 వేల మార్క్ ను దాటినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆమె ఆదాయం నెలకు రూ.23 లక్షలకు పైగా చేరిందని అంటున్నారు. ఇదిలా ఉంటే, సబ్‌స్క్రిప్షన్ వ్యవస్థపై ఓ ఇన్ ఫ్లుయెన్సర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. చాలా మందికి అసలు సబ్ స్క్రిప్షన్ ఆదాయం ఎలా వస్తుందో పూర్తిగా తెలియదని ఆయన పేర్కొన్నారు. ఉదాహరణగా, 1000 మంది రూ.100 చొప్పున చెల్లిస్తే లక్ష రూపాయలు రావాల్సి ఉంటుందని, కానీ వాస్తవంగా అంత మొత్తం క్రియేటర్ కు చేరదని వివరించారు. ఆయన చెప్పిన ప్రకారం, మొబైల్ యాప్ ల ద్వారా జరిగే చెల్లింపుల్లో ప్లాట్‌ఫారమ్ కమిషన్లు ఎక్కువగా ఉంటాయి.

మన బీచ్‌లేవీ నచ్చవెందుకు .ముఖ్యంగా యూజర్ల ద్వారా జరిగే లావాదేవీలలో యాపిల్, ఇన్‌స్టాగ్రామ్ వేర్వేరు శాతాల్లో కమిషన్ తీసుకుంటాయి. దీంతో చివరికి క్రియేటర్ చేతికి సుమారు 55 శాతం చేరుతుందని తెలిపారు. ఈ లెక్కన రూ.23 లక్షల గ్రాస్ ఆదాయం ఉంటే, వాస్తవంగా చేతికి వచ్చే మొత్తం దాదాపు రూ.13 లక్షల వరకు ఉండొచ్చని చెప్పారు. అంతేకాదు, ఆ మొత్తంలో నుంచి టాక్సులు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. కాబట్టి బయటకు కనిపించే మొత్తం ఆదాయం అంతా లాభం కాదని స్పష్టం చేశారు. అయితే ఆ విషయాన్ని తాను సమర్థించడం కాదని, కేవలం లెక్కలు చెప్పడమే తన ఉద్దేశమని పేర్కొన్నారు. మార్కెటింగ్ కోణంలో చూస్తే ఒక ఉదాహరణగా నిలుస్తుందని, వివాదం కారణంగా వచ్చిన అటెన్షన్, సోషల్ మీడియాలో వైరల్ అయిన కంటెంట్ వల్లే సబ్‌స్క్రైబర్ సంఖ్య పెరిగిందని అంటున్నారు. అటెన్షన్ అంటే డబ్బే అన్నది మరోసారి రుజువైందని చెబుతున్నారు.

# సల్మాన్ హీరోయిన్‌ని టచ్ చేసిన సౌత్ నిర్మాత ఎవరు

**ఈ జాబితాలో ఇప్పటికే చాలా మంది హీరోయిన్‌లు, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌లు చేరగా తాజాగా ఈ జాబితాలో బాలీవుడ్ హీరోయిన్ డైసీషా చేరింది.**



ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ గురించి ఎవరో ఒకరు ఏదో ఒక సందర్భంలో బయటపెడుతూ తమకు ఎదురైన చేదు అనుభవాల్ని గుర్తు చేసుకుంటూ సంచలన విషయాల్ని వెల్లడిస్తున్నారు. ఈ జాబితాలో ఇప్పటికే చాలా మంది హీరోయిన్‌లు, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌లు చేరగా తాజాగా ఈ జాబితాలో బాలీవుడ్ హీరోయిన్ డైసీషా చేరింది. అయితే దక్షిణాది దర్శక నిర్మాతలపై ఆరోపణలు చేయడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. దక్షిణాది చిత్రాల్లో నటించడం.. ఆ తరువాత కొన్నేళ్లకు అవకాశాలు తగ్గడంతో అక్కడి వారిపై విమర్శలు చేయడం బాలీవుడ్ హీరోయిన్‌లకు ఈ మధ్య అలావాటుగా మారింది.

టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ల డైలమా ఆ మధ్య రాధికా ఆప్టే, తాప్సీ దక్షిణాదిపై విమర్శలు చేయడం తెలిసిందే. అయితే డైసీషా మాత్రం కాస్టింగ్ కౌచ్ ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. బాలీవుడ్ సినిమాలతో పాటు తమిళ, మలయాళ, కన్నడ చిత్రాల్లో నటించిన డైసీ షా హేట్ 3 సినిమాతో పాపులారిటీని సొంతం చేసుకుంది. అయితే ఓ దక్షిణాది సినిమా ఆడిషన్ టైమ్‌లో తనకు చేదు అనుభవం ఎదురైందని తెలిపి షాక్ ఇచ్చింది. దక్షిణాది చిత్ర నిర్మాతలలో ఒకరు నన్ను దారుణంగా తాకారు. కాస్టింగ్ కోసం ముంబై వచ్చిన ఆయన హీరోయిన్‌ల ఎంపిక కోసం కొంత మందిని ఆడిషన్ కోసం రమ్మన్నారు. దాంతో ఆరు నుంచి ఏడుగురు అమ్మాయిలం ఆయన ఆడిషన్ కోసం వెళ్లాం. ఈ క్రమంలో ఆయన మాలోని ఒక్కొక్కరిని ఆయన విడి విడిగా కలుస్తున్నారు. ఆ సమయంలో నేను కూడా లోపలికి వెళ్లాను. ఆడిషన్ పేరుతో ఆయన నన్ను తాకడం, చేయి పట్టుకోవడం నాకు నచ్చలేదు- అని తెలిపింది డైసీషా.- బాలీ రిసార్టులో -రాజా సాబ్- బ్యూటీ.. మన బీచ్‌లేవీ నచ్చవెందుకు నన్ను ఎవరైనా తాకితే నాకు భయంగా ఉంటుంది. నేను మసాజ్‌లు చేయించకోకపోవడానికి కారణం నన్ను మరొకరు తాకడం ఇష్టం లేకనే. ఒక మహిళ తాకినా నాకు నచ్చదు. అందుకే నాకు ఆయన తాకడం నచ్చలేదు. ఆడిషన్ తరువాత నేను ఆయనకు మళ్లీ ఫోన్ చేస్తానని చెప్పి వచ్చేశాను. ఆ తరువాత ఆయనకు ఫోన్ చేయలేదు- అంటూ చెప్పుకొచ్చింది. ఇటీవల ఓ ఇన్‌ఫ్లూయెన్సర్ కాస్టింగ్ కౌచ్ గురించి సంచలన వ్యాఖ్యలు చేయడం, టాలీవుడ్ నిర్మాతపై సంచలన ఆరోపణలు చేయడం తెలిసిందే.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -“APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,“D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .